## ఎడిటర్ వ్యూ

# యుద్ధం వేళ ఉక్రెయిన్‌లో కీలక మార్పు.. కొత్త ప్రధానిగా సెర్హీ కోరెట్స్కీ

రష్యాతో భీకర యుద్ధం కొనసాగుతున్న తరుణంలో ఉక్రెయిన్‌లో కీలక రాజకీయ పరిణామం చోటుచేసుకుంది. దేశ నూతన ప్రధానమంత్రిగా ఇంధన రంగ నిపుణుడు సెర్హీ కోరెట్స్కీ నియమితులయ్యారు. ఆయన నియామకానికి ఉక్రెయిన్ పార్లమెంట్ గురువారం ఆమోదముద్ర వేసింది. దేశ ఇంధన మౌలిక సదుపాయాలపై రష్యా దాడులు తీవ్రతరం చేస్తున్న నేపథ్యంలో, ఈ రంగానికి చెందిన అనుభవజ్ఞుడికి ప్రధాని పగ్గాలు అప్పగించడం అత్యంత ప్రాధాన్యం సంతరించుకుంది. ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్‌స్కీ ఇటీవల మంత్రివర్గ పునర్వ్యవస్థీకరణ చేపట్టిన విషయం తెలిసిందే. ఇందులో భాగంగా ప్రధాని యూలియా స్విరిడెంకో తన పదవికి రాజీనామా చేయగా, ఆమె స్థానంలో ప్రభుత్వ రంగ ఇంధన సంస్థ 'నాఫ్టోగాజ్' సీఈఓగా పనిచేస్తున్న సెర్హీ కోరెట్స్కీ పేరును జెలెన్‌స్కీ ప్రతిపాదించారు. పార్లమెంట్ సభ్యులు ఈ ప్రతిపాదనను ఆమోదించారు. 2022లో రష్యా పూర్తిస్థాయి దండయాత్ర ప్రారంభించిన తర్వాత ఉక్రెయిన్ ప్రధానిగా బాధ్యతలు చేపట్టిన మూడో వ్యక్తిగా కోరెట్స్కీ నిలిచారు. ప్రధానిగా బాధ్యతలు చేపట్టిన వెంటనే కోరెట్స్కీ తన ప్రాధాన్యతలను స్పష్టం చేశారు. "ఉక్రెయిన్ రక్షణ దళాలను పూర్తిస్థాయిలో సన్నద్ధం చేయడం, రక్షణ పరిశ్రమల అభివృద్ధిని వేగవంతం చేయడం, రాబోయే శీతాకాలాన్ని సమర్థవంతంగా ఎదుర్కోవడం మా ప్రథమ కర్తవ్యం" అని ఆయన 'ఎక్స్' వేదికగా పేర్కొన్నారు. వీటితో పాటు సామాజిక బాధ్యతలను నెరవేర్చడం, యూరోపియన్ యూనియన్‌లో చేరే ప్రక్రియను ముందుకు తీసుకెళ్లడం తన ప్రధాన లక్ష్యాలని ఆయన వివరించారు. 48 ఏళ్ల కోరెట్స్కీకి ఇంధన రంగంలో అపార అనుభవం ఉంది. అయితే, ఆయనకు గతంలో ఎలాంటి రాజకీయ పదవుల అనుభవం లేదు. రష్యా దాడుల నడుమ దేశ ఇంధన స్థిరత్వాన్ని కాపాడటంలో నాఫ్టోగాజ్ సీఈఓగా ఆయన కీలక పాత్ర పోషించారు.

# ఏపీలో ఈ నెల 22న 'తల్లికి వందనం' నిధులు విడుదల...

- మొదటి పేజి తరువాయి

ఒక్కో బిడ్డకు ఏటా రూ.15,000 చొప్పున ఆర్థిక సహాయం అందిస్తారు. ప్రభుత్వ, ప్రైవేట్ ఎయిడెడ్, ప్రైవేట్ అన్-ఎయిడెడ్ పాఠశాలలు, జూనియర్ కళాశాలల్లో చదివే విద్యార్థులందరికీ ఈ పథకం వర్తిస్తుంది.

**నిధుల కేటాయింపు, చెల్లింపు విధానం**

ప్రతి విద్యార్థికి అందించే రూ.15,000 ఆర్థిక సహాయం నుంచి రూ.2,000 పాఠశాలలు, జూనియర్ కళాశాలల నిర్వహణ, పారిశుధ్యం, ఇతర అభివృద్ధి కార్యక్రమాల కోసం మినహాయిస్తారు. మిగిలిన రూ.13,000 నేరుగా అర్హులైన తల్లుల ఆధార్ అనుసంధానిత బ్యాంకు ఖాతాల్లోకి జమ చేస్తారు. ఈ ప్రక్రియ ద్వారా నాణ్యమైన విద్యను అందరికీ అందుబాటులోకి తీసుకురావడంతో పాటు, తల్లులను ఆర్థికంగా ప్రోత్సహించడం కూడా ప్రభుత్వ ఉద్దేశం.

**పథకానికి అర్హతలు ఇవే:**

'తల్లికి వందనం' పథకానికి లబ్ధిదారులను ఎంపిక చేసేందుకు ప్రభుత్వం స్పష్టమైన అర్హత నిబంధనలను నిర్దేశించింది. స్వర్ణ గ్రామ, స్వర్ణ వార్డు (గ్రా+వాసె) శాఖ ఆరు దశల ధ్రువీకరణ ద్వారా లబ్ధిదారులను ఎంపిక చేస్తుంది.

ఆదాయం: గ్రామీణ ప్రాంతాల్లో కుటుంబ నెలసరి ఆదాయం రూ.10,000, పట్టణ ప్రాంతాల్లో రూ.12,000 మించకూడదు.

భూమి: మాగాణి అయితే 3 ఎకరాల లోపు, మెట్టభూమి అయితే 10 ఎకరాల లోపు ఉండాలి. రెండూ కలిపి ఉన్నా 10 ఎకరాల పరిమితికి లోబడే ఉండాలి.

వాహనం: కుటుంబంలో ఎవరి పేరు మీదా నాలుగు చక్రాల వాహనం ఉండరాదు. అయితే, టాక్సీ, ట్రాక్టర్, ఆటోలకు ఈ నిబంధన నుంచి మినహాయింపు ఇచ్చారు.

విద్యుత్ వినియోగం: కుటుంబం నెలసరి విద్యుత్ వినియోగం సగటున 300 యూనిట్లకు మించరాదు. దీని కోసం గత 12 నెలల సగటును పరిగణనలోకి తీసుకుంటారు.

ఆస్తి: పట్టణ ప్రాంతాల్లో నివసించే కుటుంబానికి 1000 చదరపు అడుగుల కంటే ఎక్కువ విస్తీర్ణంలో మున్సిపల్ ఆస్తి ఉండకూడదు.

ప్రభుత్వ ఉద్యోగం: కుటుంబ సభ్యుల్లో ఎవరూ కేంద్ర/రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగిగా లేదా ప్రభుత్వ రంగ సంస్థల ఉద్యోగిగా ఉండరాదు. ప్రభుత్వ పింఛనుదారులకు కూడా ఇది వర్తించదు. పారిశుధ్య కార్మికులు, అంగన్‌వాడీ కార్యకర్తలు, నిర్దేశిత ఆదాయ పరిమితి లోపు జీతం తీసుకునే వారికి మినహాయింపు ఉంటుంది.

ఆదాయ పన్ను: కుటుంబంలో ఏ ఒక్క సభ్యుడు కూడా ఆదాయపు పన్ను చెల్లింపుదారుగా ఉండకూడదు.

చదువు: విద్యార్థులు తప్పనిసరిగా ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వంచే గుర్తింపు పొందిన పాఠశాల/జూనియర్ కళాశాలలో చదువుతూ ఉండాలి. ఐటీఐ, పాలిటెక్నిక్, ట్రిపుల్ ఐటీ వంటి ఫీజు రీయింబర్స్‌మెంట్ పొందే కోర్సులకు ఈ పథకం వర్తించదు.

**ప్రత్యేక నిబంధనలు, చెల్లింపులు**

అనాథలు: స్వచ్ఛంద సంస్థల ద్వారా పాఠశాలల్లో చేరిన అనాథలు, వీధి బాలలు ఈ పథకానికి అర్హులే. సంబంధిత జిల్లా కలెక్టర్ వారి తరపున గార్డియన్-ఆపరేటెడ్ బ్యాంకు ఖాతాను తెరిచి, నిధులు సక్రమంగా అందేలా పర్యవేక్షిస్తారు.

ఆర్‌టీఈ విద్యార్థులు: విద్యా హక్కు చట్టం (ఆర్‌టీఈ) కింద ప్రైవేట్ పాఠశాలల్లో చేరిన విద్యార్థుల విషయంలో, ప్రభుత్వం నిర్దేశించిన ఫీజును నేరుగా పాఠశాల యాజమాన్యానికి చెల్లిస్తారు. ఆ మొత్తం పోగా ఏమైనా మిగిలితే, దానిని తల్లి ఖాతాలో జమ చేస్తారు.

ఇతర స్కాలర్‌షిప్‌లు: ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ విద్యార్థులు కేంద్ర ప్రభుత్వ స్కాలర్‌షిప్‌లు పొందుతున్నట్లయితే, ఆ పథకం కింద వచ్చే మొత్తాన్ని మినహాయించి, మిగిలిన బ్యాలెన్స్ మొత్తాన్ని 'తల్లికి వందనం' కింద చెల్లిస్తారు.

# మళ్లీ డీలిమిటేషన్ బిల్లు?.. కేంద్రానికి కాంగ్రెస్ కీలక విజ్ఞప్తి

- మొదటి పేజి తరువాయి

నరేంద్ర మోదీని కోరారు. ఈ మేరకు గురువారం ఆయన ప్రధానికి లేఖ రాశారు. బిల్లును సభలో ప్రవేశపెట్టే ముందు పార్టీలకు వాటిని పూర్తిగా పరిశీలించే అవకాశం కల్పించాలని విజ్ఞప్తి చేశారు. ఈ ఏడాది మార్చి, ఏప్రిల్‌లో కూడా డీలిమిటేషన్ ప్రతిపాదనలపై అఖిలపక్ష సమావేశం నిర్వహించాలని పార్లమెంటరీ వ్యవహారాల మంత్రికి పలుమార్లు లేఖలు రాసినా స్పందన రాలేదని ఖర్గే పేర్కొన్నారు. ఆ అభ్యర్థనలను కేంద్ర ప్రభుత్వం పరిగణనలోకి తీసుకోలేదని తెలిపారు. ఏప్రిల్ 17న లోక్‌సభలో ప్రవేశపెట్టిన రాజ్యాంగ సవరణ బిల్లు-2026కు అవసరమైన మూడింట రెండొంతుల మెజారిటీ లభించకపోవడంతో అది ఆమోదం పొందలేదని గుర్తు చేశారు. ఇప్పుడు అదే బిల్లును సవరించి వర్షాకాల సమావేశాల్లో మళ్లీ తీసుకురానున్నట్లు మీడియాలో వార్తలు వస్తున్నాయని పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో సవరించిన డీలిమిటేషన్ ప్రతిపాదనలు, అనుబంధ అంశాలపై అన్ని రాజకీయ పార్టీలతో చర్చించాలని ఖర్గే లేఖలో కోరారు. బిల్లులను పార్లమెంట్‌లో ప్రవేశపెట్టే ముందు వాటిని అధ్యయనం చేసేందుకు తగిన సమయం ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు.

డీలిమిటేషన్ బిల్లు-2026, కేంద్ర పాలిత ప్రాంతాల చట్టాల (సవరణ) బిల్లు-2026 కూడా ఏప్రిల్‌లో లోక్‌సభలో ఆమోదం పొందలేదు. ఈ ప్రతిపాదనల ప్రకారం లోక్‌సభ, రాష్ట్ర శాసనసభల్లో మహిళల రిజర్వేషన్ల అమలుకు మార్గం సుగమం చేయడంతో పాటు, లోక్‌సభ స్థానాల సంఖ్యను 850కు పెంచడం, 1976 తర్వాత తొలిసారి దేశవ్యాప్తంగా నియోజకవర్గాల పునర్విభజన చేపట్టేందుకు అవకాశం కల్పించనున్నారు.

# ఆ సబ్ రిజిస్ట్రార్ రూటే సెపరేటు..

- స్టెనో నుంచి సబ్ రిజిస్ట్రార్ వరకు ఉద్యోగ ప్రస్థానం
- ఉమ్మడి రాష్ట్రం నుంచి ఆంధ్రప్రదేశ్ వరకు పోస్టింగ్‌ల వివరాలు
- వరుస బదిలీలతో సాగిన అధికారిక ప్రయాణం
- అక్రమాస్తులపై వస్తున్న ఆరోపణలు.. నిజానిజాలపై ప్రశ్నలు
- పత్రాలు, ఆధారాల సేకరణలో పెన్ పవర్ ప్రత్యేక బృందం

**ఏలూరు జిల్లా భీమడోలు సబ్ రిజిస్ట్రార్ కార్యాలయానికి సంబంధించిన ఆరోపణలపై పెన్ పవర్ నిర్వహిస్తున్న ప్రత్యేక ఇన్వెస్టిగేషన్ టీం కథనాల శ్రేణిలో ఎపిసోడ్-3 .**

**స్టెనోగా ప్రారంభమైన ఉద్యోగ జీవితం.. సబ్ రిజిస్ట్రార్‌గా వరుస పోస్టింగులు.. ఇప్పుడు వక్ర మార్గంలో కోట్ల విలువైన ఆస్తులపై వస్తున్న ఆరోపణలు. ఇవన్నీ చట్టబద్ధ ఆదాయంతోనే సమకూరాయా? లేక ఇతర ఆదాయ వనరులు ఉన్నాయా? అనే ప్రశ్నలకు సమాధానాల కోసం పెన్ పవర్ ప్రత్యేక ఇన్వెస్టిగేషన్ టీం ఆస్తుల చిట్టా దుమ్ము దులుపుతుంది.. ఈ క్రమంలో విస్తుపోయే నిజాలు ఒక్కటిగా వెలుగు చూస్తున్నాయి.** ఎడిటర్, పెన్ పవర్ జూలై 16:

ఈ ఎపిసోడ్‌లో సంబంధిత అధికారి ఉద్యోగ ప్రస్థానం, ఆయనపై వస్తున్న ఆస్తుల ఆరోపణలు, వాటి వెనుక ఉన్న ప్రశ్నలను పరిశీలిస్తోంది. సమాచారం ప్రకారం వి. రాఘవేంద్ర ప్రసాద్ స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్ శాఖలో స్టెనోగా తన ఉద్యోగ జీవితాన్ని ప్రారంభించారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో సేవలు ప్రారంభించిన ఆయన, అనంతరం పదోన్నతితో 2017లో (ఇప్పటి తెలంగాణ రాష్ట్రంలో) అప్పటి ఉమ్మడి ఆంధ్ర ప్రదేశ్ లో హైదరాబాద్ ఎస్.ఆర్. నగర్ డీఐజీ కార్యాలయంలో సూపరింటెండెంట్‌గా పనిచేశారు. తర్వాత 2018లో చిట్యాల సబ్ రిజిస్ట్రార్‌గా తొలి పోస్టింగ్ పొందారు. అక్కడ 2018--2019 వరకు విధులు నిర్వహించిన అనంతరం, రాష్ట్ర విభజన తర్వాత ఆంధ్రప్రదేశ్‌లో ని ప్రస్తుత తూర్పు గోదావరి జిల్లా తాళ్లపూడి మండలం వేగేశ్వరపురం సబ్ రిజిస్ట్రార్ కార్యాలయానికి బదిలీ అయ్యారు. అక్కడ 2019 నుంచి 2022 వరకు పనిచేశారు.

ఆ తర్వాత 2022 నుంచి 2024 వరకు అనంతపల్లి సబ్ రిజిస్ట్రార్‌గా విధులు నిర్వర్తించారు. అనంతరం 2024లో భీమడోలు సబ్ రిజిస్ట్రార్‌గా బాధ్యతలు చేపట్టి ప్రస్తుతం కొనసాగుతున్నారు.

ఇంతవరకు ఉద్యోగ ప్రస్థానంలో, ముఖ్యంగా సబ్ రిజిస్ట్రార్‌గా బాధ్యతలు చేపట్టిన తర్వాత ఆయన పేరుతో కాకుండా కుటుంబ సభ్యులు, బంధువుల పేర్లపై కూడా ఆస్తులు కూడబెట్టినట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. విజయవాడ నగరంలో కుమారుడి పేరుతో హోటల్, తండ్రి పేరుతో ఇతర ఆస్తులు, బంధువుల పేర్లపై మరిన్ని ఆస్తులు ఉన్నాయనే సమాచారం పెన్ పవర్ పరిశీలనలోకి వచ్చింది. అయితే ఈ ఆస్తులన్నీ చట్టబద్ధ ఆదాయంతోనే సమకూరాయా? లేక ఇతర ఆదాయ వనరులు ఏమైనా ఉన్నాయా? అనే అంశాలపై స్పష్టత అవసరమనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. ఈ నేపథ్యంలో సంబంధిత పత్రాలు, రిజిస్ట్రేషన్ రికార్డులు, ఇతర ఆధారాలను సేకరించి వాస్తవాలను వెలికితీసేందుకు పెన్ పవర్ ప్రత్యేక దర్యాప్తు కొనసాగిస్తోంది.

**ఎపిసోడ్ -4లో..**
**విజయవాడలో హోటల్ ఎవరి పేరుతో కొన్నారు..? పెట్టుబడి ఎంత..?**
**రిజిస్ట్రేషన్ పత్రాలు ఏమి చెబుతున్నాయి..?**
**చదువుతూనే ఉండండి పెన్ పవర్ తెలుగు దినపత్రిక**

# రాష్ట్రాన్ని దోచేస్తున్నారు.. అప్పుల్లో రికార్డులు సృష్టిస్తున్నారు

వైసీపీ అధినేత జగన్ అధ్యక్షతన ఆ పార్టీ పార్లమెంటరీ పార్టీ సమావేశం జరిగింది. రాబోయే పార్లమెంట్ సమావేశాల్లో ఎంపీలు అనుసరించాల్సిన వ్యూహాలపై ఈ సందర్భంగా దిశా నిర్దేశం చేసిన జగన్... ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రయోజనాలే పరమావధిగా ఉభయ సభల్లో గళం విప్పాలని పిలుపునిచ్చారు. మహిళా రిజర్వేషన్ బిల్లుకు వైసీపీ మద్దతుగా ఉంటుందని ఆయన తెలిపారు. ఈ సందర్భంగా కూటమి ప్రభుత్వంపై జగన్ తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డారు. పోటీ పరీక్షలు నిర్వహించకుండానే డీఎస్పీ పోస్టులను భర్తీ చేయడం రాష్ట్ర చరిత్రలోనే ఒక పెద్ద స్కామ్ అని ఆరోపించారు. డీఎస్సీ ఉపాధ్యాయ నియామకాల్లో తీవ్రమైన అవకతవకలు జరిగాయని విమర్శించారు. తమ వారికి ఉద్యోగాలు ఇచ్చుకోవడానికి ప్రత్యేకంగా జీవోలు తెచ్చి... ఆ పని పూర్తికాగానే జీవోలను రద్దు చేశారన్నారు. స్పోర్ట్స్ అసోసియేషన్లు సైతం వారి చేతుల్లోనే ఉన్నాయని, సాఫ్ట్‌బాల్ అసోసియేషన్ ప్రెసిడెంట్ గా టీడీపీ ఎమ్మెల్యే కూన రవికుమార్, జూడో సంఘానికి నారా లోకేశ్ తోడల్లుడు భరత్ గౌరవ అధ్యక్షుడిగా ఉన్నారని విమర్శించారు. రాష్ట్రంలో విలువైన ప్రభుత్వ భూములను ఇష్టారాజ్యంగా దోచిపెడుతున్నారని జగన్ మండిపడ్డారు. అమరావతి రాజధాని నిర్మాణంలో చదరపు అడుగుకు రూ. 20,000 పైనే ఖర్చు చూపిస్తూ దేశంలో ఎక్కడా లేని విధంగా దోపిడీ చేస్తున్నారని, భూసమీకరణ (ల్యాండ్ పూలింగ్)కు ఒప్పుకోని రైతుల భూములను బలవంతంగా లాక్కుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. "వైసీపీ ప్రభుత్వ హయాంలో దాదాపు రూ. 5,000 కోట్ల విలువతో నిర్మితమైన రామాయపట్నం పోర్టును కేవలం రూ. 1,500 కోట్లకే ప్రైవేట్ సంస్థలకు అప్పగించడం పెద్ద కుంభకోణం కాదా? ఇలాంటి ఆదాయ వనరులను ప్రైవేటుకు ఇస్తే రాష్ట్రానికి ఆదాయం ఎక్కడి నుంచి వస్తుంది?" అని ప్రశ్నించారు. కూటమి ప్రభుత్వం అప్పులు చేయడంలో సరికొత్త రికార్డులు సృష్టిస్తోందని జగన్ ధ్వజమెత్తారు. ఎఫ్ఆర్‌బీఎం చట్టం పరిమితులను సైతం ఉల్లంఘించి గత రెండేళ్లలోనే రూ. 3.6 లక్షల కోట్ల భారీ అప్పులు చేశారని ఆరోపించారు. ఇంత అప్పు తెచ్చినా... ప్రజలకు, రాష్ట్రానికి చేసింది మాత్రం శూన్యమని విమర్శించారు. ఇసుక, మైన్స్, లిక్కర్ ఇలా ప్రతి రంగంలోనూ మాఫియా రాజ్యమేలుతోందని ఆరోపించారు.

# సొంత పార్టీ నేతపై వేటు.. అవినీతికి పాల్పడే మంత్రులు, ఉద్యోగులకు సీఎం విజయ్ వార్నింగ్

తమిళనాడు ముఖ్యమంత్రి విజయ్ తన పాలనా దృక్పథం ఏంటో మరోసారి చూపించారు. అవినీతి, అధికార దుర్వినియోగంపై తన మంత్రులకు, ప్రభుత్వ యంత్రాంగానికి గట్టి హెచ్చరికలు జారీ చేశారు. తన ప్రభుత్వంలో లంచాలకు, అవినీతికి తావులేదని... తప్పు చేసిన వారికి రెండో అవకాశం ఉండే ప్రసక్తే లేదని ఈరోజు విడుదల చేసిన ఒక ప్రకటనలో స్పష్టం చేశారు. ప్రజలకు పూర్తి పారదర్శకమైన, జవాబుదారీతనంతో కూడిన పాలన అందించడమే తమ లక్ష్యమని చెప్పారు.

సొంత పార్టీ నేతపైనే వేటు: ఇటీవల తమిళనాడు వెల్ఫేర్ అసోసియేషన్ చెంగల్పట్టు ఈస్ట్ జిల్లా జాయింట్ సెక్రటరీ వీరాస్వామి (టీవీకే పార్టీ) లంచం తీసుకుంటున్నట్లు ఉన్న ఒక వీడియో సోషల్ మీడియాలో విపరీతంగా వైరల్ అయింది. దీనిపై తీవ్ర రాజకీయ విమర్శలు రావడంతో... విజయ్ ఏమాత్రం ఉపేక్షించకుండా ఆయనను పార్టీ ప్రాథమిక సభ్యత్వంతో పాటు అన్ని పదవుల నుంచి తక్షణమే తొలగిస్తూ సంచలన నిర్ణయం తీసుకున్నారు. అనంతరం పోలీసులు కూడా వీరాస్వామిని అరెస్ట్ చేశారు.

ఇటీవల కరూర్‌లో జరిగిన ప్రజాసభలో విజయ్ మాట్లాడుతూ ప్రజలకు కొండంత భరోసా ఇచ్చారు. "ఎవరైనా లంచం అడిగితే నిర్భయంగా 'ఇవ్వను' అని చెప్పండి. మీ వెనుక నేను ఉంటాను. ఒకవేళ ఇంకా ఒత్తిడి చేస్తే... ఈ రాష్ట్రాన్ని పాలిస్తున్న విజయ్ మా వెన్నంటి ఉన్నాడని ధైర్యంగా చెప్పండి" అంటూ ప్రజల్లో ధైర్యాన్ని నింపారు. ప్రజా ప్రభుత్వంలో అవినీతిని కూకటివేళ్లతో నిర్మూలించడానికి తాము కట్టుబడి ఉన్నామని... ప్రజల సహకారంతోనే ఈ మార్పు సాధ్యమవుతుందని స్పష్టం చేశారు. సొంత పార్టీ కీలక నేతపైనే కఠిన చర్యలు తీసుకోవడం ద్వారా... అవినీతి విషయంలో తాను ఎంత కఠినంగా ఉంటానో విజయ్ చెప్పకనే చెప్పినట్లయింది.

# ఇస్రో శాస్త్రవేత్తల రాజీనామాల అంశంపై కేంద్రమంత్రి కీలక వ్యాఖ్యలు

కుడంకుళం అణు విద్యుత్ కేంద్రానికి సంబంధించిన డేటా లీక్ వ్యవహారం, ఇస్రోలో కీలక శాస్త్రవేత్తల రాజీనామాలను నియంత్రించేందుకు ప్రవేశపెట్టిన నూతన విధానంపై వ్యక్తమవుతున్న ఆందోళనలపై కేంద్ర సైన్స్ అండ్ టెక్నాలజీ శాఖ సహాయ మంత్రి జితేంద్ర సింగ్ స్పందించారు. ఈ రెండు అంశాల్లోనూ ఆందోళన చెందాల్సిన అవసరం లేదని ఆయన స్పష్టం చేశారు. ప్రాజెక్టుల భద్రతకు, పురోగతికి ఎలాంటి విఘాతం కలగదని ఆయన భరోసా ఇచ్చారు.

ఇటీవల 'వరల్డ్ లీక్స్' అనే రాన్సమ్‌వేర్ గ్రూప్, కుడంకుళం అణు విద్యుత్ ప్రాజెక్టుకు సంబంధించిన సుమారు 19,000 ఫైళ్లను డార్క్ వెబ్‌లో బహిర్గతం చేసినట్లు వార్తలు వచ్చాయి. సుమారు 14.3 జీబీ డేటా కలిగిన ఈ ఫైళ్లలో ప్లాంట్ బ్లూప్రింట్లు, సరఫరాదారుల వివరాలు ఉన్నట్లు ప్రచారం జరిగింది. దీనిపై మంత్రి జితేంద్ర సింగ్ స్పందిస్తూ, ప్లాంట్‌కు సంబంధించిన ఎటువంటి సున్నితమైన సమాచారం లీక్ కాలేదని, వ్యూహాత్మక భద్రతకు ఎలాంటి ముప్పు లేదని తేల్చిచెప్పారు. ఈ డేటా లీక్ అనేది ప్లాంట్ కాంట్రాక్టర్లలో ఒకరికి చెందిన థర్డ్-పార్టీ సర్వర్ నుంచి పాక్షికంగా జరిగినట్లు గుర్తించామని, దీనిపై ప్రస్తుతం విచారణ జరుగుతోందని వివరించారు. మరోవైపు, గగన్‌యాన్ వంటి కీలక ప్రాజెక్టులలో విధులు నిర్వహిస్తున్న గ్రూప్ 'ఏ' శాస్త్రవేత్తలు, సాంకేతిక ద సిబ్బంది రాజీనామాలను తక్షణమే ఆమోదించవద్దని అంతరిక్ష విభాగం జులై 14న ఒక మెమో జారీ చేసింది. దీనిపై మంత్రి మాట్లాడుతూ, ఇది కేవలం పరిపాలనాపరమైన నిర్ణయమని, ఉన్నత స్థాయిలో బాధ్యతాయుతమైన నిర్ణయాలు తీసుకునేందుకే ఈ ఏర్పాటు చేశామని పేర్కొన్నారు. ఈ సందర్భంగా 'చాలామంది వస్తుంటారు, పోతుంటారు' అని ఆయన వ్యాఖ్యానించారు. ఇస్రో ఛైర్మన్ వి. నారాయణన్ సైతం ఈ నిర్ణయం వల్ల ప్రాజెక్టుల నిర్వహణకు ఎలాంటి ఇబ్బందులు ఉండబోవని స్పష్టం చేశారు.

# న్యూజిలాండ్‌లో భూకంపం... సునామీ హెచ్చరిక జారీ

- మొదటి పేజి తరువాయి

భయాందోళనలకు గురవుతున్నారు. వివరాల్లోకి వెళితే, ప్రముఖ పర్యాటక ప్రాంతమైన ఫియోర్డ్‌ల్యాండ్ రీజియన్‌లోని టె అనౌకు 40 కిలోమీటర్ల దూరంలో భూకంప కేంద్రం ఉన్నట్లు అధికారులు గుర్తించారు. ఈ భూకంపం కారణంగా మిల్ఫోర్డ్ సౌండ్ నుంచి ప్యూసెగుర్ పాయింట్ వరకు ఉన్న దక్షిణ దీవి పశ్చిమ తీరానికి సునామీ హెచ్చరికలు జారీ చేశారు. సముద్రపు అలలు తీరప్రాంతాల్లోకి చొచ్చుకువచ్చే ప్రమాదం ఉందని, ప్రజలు తక్షణమే ఎత్తైన ప్రదేశాలకు లేదా లోతట్టు ప్రాంతాల నుంచి దూరంగా వెళ్లాలని సూచించారు. ట్రాఫిక్ సమస్యలు తలెత్తకుండా ఉండేందుకు నడిచి, పరిగెత్తి లేదా సైకిళ్లపై సురక్షిత ప్రాంతాలకు తరలివెళ్లాలని విజ్ఞప్తి చేశారు.

ఆస్ట్రేలియన్, పసిఫిక్ టెక్టానిక్ ప్లేట్ల సరిహద్దులో న్యూజిలాండ్ ఉండటంతో ఇక్కడ తరచుగా భూకంపాలు సంభవిస్తుంటాయి. 2011లో సంభవించిన క్రైస్ట్‌చర్చ్ భూకంపం 185 మందిని బలిగొన్న విషయం తెలిసిందే. తాజా భూకంపం వల్ల ఎలాంటి ప్రాణ నష్టం గానీ, ప్రధాన ఆస్తి నష్టం గానీ జరిగినట్లు ఇంకా సమాచారం అందలేదని, పరిస్థితిని సమీక్షిస్తున్నామని జాతీయ అత్యవసర నిర్వహణ ఏజెన్సీ (ఎన్ఈఎంఏ) అధికారులు తెలిపారు.

# డ్రగ్స్ కేసులో తెలంగాణ ఎమ్మెల్సీ కుమారుడు..?

హైదరాబాద్‌లో డ్రగ్స్ వ్యవహారం మరోసారి కలకలం రేపింది. నగరంలోని మంగళ్‌హాట్ ప్రాంతంలో పోలీసులు జరిపిన దాడిలో బీఆర్ఎస్ ఎమ్మెల్సీ పి. వెంకట్రామ్ రెడ్డి కుమారుడు భరత్ రాజ్ రెడ్డితో పాటు మరో ఇద్దరు యువకులను అదుపులోకి తీసుకున్నట్టు తెలుస్తోంది. అయితే, తన కుమారుడు డ్రగ్స్ వినియోగించలేదని, అతడిని అరెస్ట్ చేయలేదని ఎమ్మెల్సీ వెంకట్రామ్ రెడ్డి స్పష్టం చేశారు. ఐఏఎన్ఎస్ కథనం మేరకు.. బుధవారం రాత్రి మంగళ్‌హాట్‌లో ఓ ముఠా గంజాయి, హ్యాష్ ఆయిల్ కొనుగోలు చేసి సేవిస్తోందని తెలియడంతో పోలీసులు దాడి చేశారు. ఈ దాడిలో భరత్ రాజ్ రెడ్డి, అభిషేక్, యునిత్‌లను పట్టుకోగా, మరో నలుగురు పరారయ్యారు. వారి వద్ద నుంచి 24 గ్రాముల హ్యాష్ ఆయిల్, 22 గ్రాముల గంజాయిని స్వాధీనం చేసుకున్నట్లు పోలీసులు తెలిపారు. అదుపులోకి తీసుకున్న ముగ్గురిని మంగళ్‌హాట్ పోలీస్ స్టేషన్‌కు తరలించి, రక్త నమూనాలను సేకరించారు. అనంతరం వైద్య పరీక్షల నిమిత్తం ఉస్మానియా ఆసుపత్రికి పంపించారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసిన పోలీసులు, పరారీలో ఉన్న సోని, వంశీ, మనోజ్, తులిజాల కోసం గాలిస్తున్నారు.

కాగా, ఈ ఆరోపణలను ఎమ్మెల్సీ వెంకట్రామ్ రెడ్డి తీవ్రంగా ఖండించారు. తన కుమారుడు భరత్ రెడ్డి డ్రగ్స్ తీసుకున్నాడని, అతడిని అరెస్ట్ చేశారని వస్తున్న వార్తల్లో నిజం లేదని ఓ ప్రకటనలో తెలిపారు. "ఒక కామన్ ఫ్రెండ్ ఫోన్ కాంటాక్ట్ లిస్ట్‌లో నంబర్ ఉండటంతో, డ్రగ్స్ కేసుకు సంబంధించి విచారణకు సహకరించాలని పోలీసులు మా ఇంటికి వచ్చారు. విచారణలో నా కుమారుడు డ్రగ్స్ తీసుకోలేదని తేలింది. అతడిని అరెస్ట్ చేయలేదు" అని ఆయన వివరించారు. ఈ ప్రాంతంలో తరచూ డ్రగ్స్ కేసులు నమోదవుతుండటంతో పోలీసులు నిఘా కట్టుదిట్టం చేశారు.

### అమరావతిలో జగన్నాథ రథయాత్ర..

# బంగారు చీపురుతో ఊడ్చి సేవ చేసిన సీఎం చంద్రబాబు

- మొదటి పేజి తరువాయి

ఈ మహోత్సవంలో ముఖ్యమంత్రి చంద్రబాబుతో పాటు కేంద్ర సహాయ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్, రాష్ట్ర మంత్రి పి.నారాయణ, స్థానిక శాసనసభ్యులు, ఇతర ప్రజాప్రతినిధులు, వేలాదిగా భక్తులు పాల్గొని రథాన్ని లాగారు. ఈ సందర్భంగా, అమరావతి బృహత్ ప్రణాళిక చిత్రపటాన్ని శిరస్సుపై ధరించి, రాజధాని నగరం విశ్వనగరంగా ఎదగాలని ఆయన జగన్నాథ స్వామిని ప్రార్థించారు. అనంతరం జరిగిన సభలో ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రసంగించారు. దేశంలో పూరీ జగన్నాథ రథయాత్రకు ఎంతో విశిష్టత ఉందని, అందరూ అక్కడికి వెళ్లలేరని, అలాంటిది తొలిసారిగా అమరావతిలో ఈ యాత్ర నిర్వహించడం ఆనందదాయకమని అన్నారు. ఈ యాత్రలో పాల్గొనడం తన పూర్వజన్మ సుకృతమని పేర్కొన్నారు. ఇకపై ప్రతిఏటా అమరావతిలో జగన్నాథ రథయాత్ర నిర్వహిస్తామని ఇస్కాన్ ప్రకటించడం పట్ల ఆయన సంతోషం వ్యక్తం చేశారు.

ఈ సందర్భంగా ఇస్కాన్, అక్షయపాత్ర ఫౌండేషన్‌లు అందిస్తున్న సేవలను చంద్రబాబు కొనియాడారు. దేశంలోని 16 రాష్ట్రాలు, 3 కేంద్రపాలిత ప్రాంతాల్లో 25 వేలకు పైగా పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాల్లో అక్షయపాత్ర నాణ్యమైన ఆహారాన్ని అందిస్తోందని తెలిపారు. ప్రపంచంలోనే ఇంత పెద్ద ఎత్తున 500 కోట్ల మందికి ఆహారం అందించడం అరుదైన విషయమని ప్రశంసించారు. ఏపీలో 10 సెంట్రలైజ్డ్ కిచెన్ల ద్వారా రోజూ 1.80 లక్షల మంది విద్యార్థులకు భోజనం అందిస్తున్నట్లు వివరించారు.

ఆధునిక జీవనశైలి వల్ల ఎదురవుతున్న సమస్యలను ప్రస్తావిస్తూ, మానవ సంబంధాలు తగ్గి సామాజిక మాధ్యమాల ప్రతికూల ప్రభావం కుటుంబాలపై పడుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. దీని కారణంగా కొన్ని కుటుంబాల్లో ఆత్మహత్యలు, చిన్నారులపై అఘాయిత్యాలు జరుగుతున్నాయని, జీవితాల్లో ఒత్తిడిని దూరం చేసుకోవాలంటే ఆధ్యాత్మికత ఒక్కటే మార్గమని స్పష్టం చేశారు. "మైక్రో ఫ్యామిలీలు కాదు, ఉమ్మడి కుటుంబాలు కావాలి. అదే మన భారతీయ సంప్రదాయం" అని ఆయన పిలుపునిచ్చారు. సమాజం ప్రశాంతంగా ఉండటానికి దేవాలయాలు దోహదపడతాయని, అందుకే రాష్ట్రంలో 5 వేల శ్రీవారి ఆలయాలను నిర్మించాలని నిర్ణయించినట్లు ప్రకటించారు. భారతీయ సంస్కృతిని కాపాడేందుకు ఇస్కాన్ వంటి సంస్థలతో కలిసి పనిచేస్తామని హామీ ఇచ్చారు. అమరావతి, పోలవరం ప్రాజెక్టులను పూర్తి చేసి రాష్ట్ర ప్రజలకు మేలు చేయడమే తమ ప్రభుత్వ సంకల్పమని చంద్రబాబు పునరుద్ఘాటించారు. జగన్నాథ రథయాత్ర తలపెట్టగానే అమరావతిలో వర్షం కురిసి వాతావరణం చల్లబడటం శు భసూచకమని అన్నారు. ఆ జగన్నాథ స్వామి కృప రాష్ట్ర ప్రజలందరిపై ఉండాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నట్లు తెలిపారు.

# వర్షాకాలం ప్రారంభమైన రోడ్లపైనే పశువులు



**పట్టించుకోని అధికారులు**

**వై రామవరం, పెన్ పవర్, జూలై 16 :** వర్షాకాలం ప్రారంభమైన, రైతుల నారుమళ్లు వేసుకుంటున్న పశువులను కట్టడం లేదని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

మండలంలో పశువులు వర్షాకాలం ప్రారంభమైన కట్టడం లేదని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. పగలంతా మేత సేకరణ కోసం తిరిగి సాయంత్రం అయ్యే సమయానికి రహదారులపై నివాసం ఉంటున్నాయని రైతులు తెలిపారు. రహదారులపై నివాసం ఉండడం తో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, రాత్రి సమయంలో వాహనదారులకు ప్రమాదాలు సంభవిస్తున్నాయని తెలిపారు. ఇకనైనా సచివాలయం సిబ్బంది స్పందించి ఆ యా పంచాయతీల పరిధిలో రైతులకు పశువులను వదిలేయడం వల్ల కలిగే నష్టాన్ని తెలియజేసి అవగాహన కల్పించవలసిన ఆవశ్యకత ఎంత ఉందని రైతులు అంటున్నారు. ఇకనైనా అధికారులు స్పందించి ఆయా గ్రామాలలో పశువులను కట్టే విధంగా చర్యలు తీసుకోవాలని పలువురు కోరుచున్నారు.

పెన్ పవర్
పోలవరం - ఏలూరు
తూర్పుగోదావరి - పశ్చిమ గోదావరి

# 22న కలెక్టరేట్ లో మెగా జాబ్ మేళా




**రాజమహేంద్రవరం, జూలై 16:** ఈనెల 22న కలెక్టరేట్ లో మెగా జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు రూరల్ శాసన సభ్యులు, టిడిపి పొలిట్ బ్యూరో సభ్యులు గోరంట్ల బుచ్చయ్య చౌదరి చెప్పారు.ఆరోజు ఉదయం 9గంటల నుంచి జరిగే జాబ్ మేళాలో 1600పోస్టులు భర్తీ చేయడానికి 14కంపెనీలు రాబోతున్నాయని ఆయన తెలిపారు. ఈ అవకాశాన్ని యువత వినియో గించుకోవాలని ఆయన సూచించారు. ఎమ్మెల్యే గోరంట్ల గురువారం తన నివాసంలో ప్రెస్ మీట్ లో మాట్లాడుతూ జాబ్ మేళాను సద్వినియోగం

చేసుకోవాలన్నారు. కూటమి ప్రభుత్వ కృషితో రాష్ట్రానికి 24లక్షల కోట్ల పెట్టుబడులు వస్తున్నాయని, ఇందులో సగం పెట్టుబడులకు పనులు ప్రారంభం అయ్యాయని ఎమ్మెల్యే గోరంట్ల తెలిపారు. ఉత్తరాంధ్ర, రాయలసీమ ప్రాంతాల్లో పరిశ్రమలు వస్తున్నాయన్నారు. నక్కపల్లి, కడప లలో స్టీల్ ప్లాంట్ లు, రాష్ట్రానికి ఆటోమొబైల్స్, సెల్ ఫోన్స్ తయారీ పరిశ్రమలు వస్తున్నాయని ఎమ్మెల్యే గోరంట్ల చెప్పారు. ఉపాధి అవకాశాలను అందిపుచ్చుకోవడానికి నైపుణ్యాలను పెంపొందించుకోవాలని యువతకు సూచించారు.

పొట్టిలంక బ్రిడ్జి సాధించడానికి చేసి కృషి ఫలించిందని ఎమ్మెల్యే గోరంట్ల చెప్పారు. నిధులు మంజూరు జీవో వచ్చిందని,త్వరలో పనులు ప్రారంభం అవుతాయ న్నారు. 487లక్షలతో నిర్మించనున్న ఈ బ్రిడ్జి వలన 4 గ్రామాలకు ఉపయోగంగా ఉంటుందన్నారు. జల్ జీవన్ మిషన్ ద్వారా అన్ని గ్రామాలకు మంచినీటి సౌకర్యం కల్పించడానికి కసరత్తు జరుగుతోందన్నారు. గతంలో పుష్కరాల పేరుచెప్పి కీలకమైన రోడ్లు విస్తరించామని ఆయన గుర్తుచేసారు. ఇప్పుడు గాదాలమ్మ పుంత, పిడింగొయ్యి తదితర రోడ్లను విస్తరించడం, బ్రిడ్జిలు నిర్మించడం చేస్తామని ఆయన తెలిపారు. పుష్కరాలకు ఎండోమెంట్ డిపార్ట్ మెంట్ పనులు జరుగుతున్నాయని, ఆర్ అండ్ బి, ఇరిగేషన్ పనులు ప్రారంభం కానున్నాయని ఎమ్మెల్యే గోరంట్ల చెప్పారు. ఎంపీ పురందేశ్వరి కృషితో ఇండోర్ స్టేడియం వచ్చిందని, క్రికెట్ స్టేడియం కూడా అవసరం ఉందన్నారు. క్రికెట్ అసోసియేషన్ వద్ద నిధులు ఉన్నాయని, 10ఎకరాల స్థలం చూపిస్తే స్టేడియం కడతారని ఆయన అన్నారు. ఎస్టీపీ రోడ్డులో స్థల సేకరణ చేయాల్సి ఉందన్నారు. పెరిగిన జనాభా దృష్ట్యా మరో రెండు పోలీస్ స్టేషన్లు అవసరమని, క్వారీ ఏరియాలో ఒకటి ఉండాలని ఆయన అన్నారు. మున్సిపల్ కార్పొరేషన్ ఎన్నికలను జరిపించడానికి కృషి చేస్తున్నానని ఎమ్మెల్యే గోరంట్ల తెలిపారు. గ్రామాల విలీన ప్రక్రియతో దాదాపు 10లక్షల జనాభాతో గ్రేటర్ రాజమహేంద్రవరంగా రూపాంతరం చెందుతందని అన్నారు. మాజీ మంత్రి, ముద్రగడ పద్మనాభంతో గల అనుబంధం మరువలేనిదని ఎమ్మెల్యే గోరంట్ల అన్నారు. తండ్రిని కడసారి చూడ్డానికి వచ్చిన కుమార్తెను అడ్డుకోవడం దారుణమని ఆయన వ్యాఖ్యానించారు. మంత్రిగా,ఎంపీగా విశిష్ట సేవలు అందించిన ముద్రగడకు అధికార లాంఛనాలతో అంత్యక్రియలు నిర్వహించాలని ప్రభుత్వం నిర్ణయిస్తే వైసిపి వాళ్ళు అడ్డుతగలడం శోచనీయమని గోరంట్ల వ్యాఖ్యానించారు. ముద్రగడకు నివాళికి జగన్ ఊరేగింపుగా రావడం శోచనీయమన్నారు. . ప్రతీది రాజకీయం చేస్తున్నారని ఆయన విమర్శించారు. ఇప్పటికే ప్రజలు బుద్ధి చెప్పి 11సీట్లకు పరిమితం చేసారని, వచ్చే ఎన్నికల్లో అవి కూడా రాకుండా చేస్తారని ఆయన అన్నారు

# ప్రెసిడెన్షియల్ ఉత్తర్వులు--2025 అమలులో పారదర్శకతకు ప్రాధాన్యం







**ప్రభుత్వ కాలపట్టిక ప్రకారమే అన్ని ప్రక్రియలు పూర్తి చేయాలి: కలెక్టర్ కె. దినేష్ కుమార్**

**గంగవరం /రంపచోడవరం, పెన్ పవర్ జూలై 16 :** ప్రెసిడెన్షియల్ ఉత్తర్వులు--2025 అమలును ప్రభుత్వం నిర్దేశించిన కాలపట్టిక ప్రకారం పారదర్శకంగా, సమర్థవంతంగా పూర్తి చేయాలని పోలవరం జిల్లా కలెక్టర్ కె. దినేష్ కుమార్ జిల్లా అధికారులను ఆదేశించారు.గురువారం ఐటీడీఏ సమావేశ మందిరంలో నిర్వహించిన జిల్లా స్థాయి సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడుతూ, స్థానిక కేడర్ల పునర్వ్యవస్థీకరణ, ఉద్యోగుల సీనియారిటీ జాబితాల ఖరారు, అభ్యంతరాల పరిశీలన, ఆప్షన్ ఫారాల స్వీకరణ, ఉద్యోగుల కేటాయింపు వంటి అన్ని ప్రక్రియలను ప్రభుత్వ మార్గదర్శకాలు, నిర్దేశిత కాలపట్టికకు అనుగుణంగా పూర్తి చేయాలని స్పష్టం చేశారు.ముసాయిదా సీనియారిటీ జాబితాలను సకాలంలో ప్రచురించి, ఉద్యోగుల నుంచి వచ్చిన అభ్యంతరాలను పరిశీలించి పరిష్కరించిన అనంతరం తుది సీనియారిటీ జాబితాలను ఆలస్యం లేకుండా విడుదల చేయాలని సూచించారు. ఉద్యోగుల కేటాయింపు ప్రక్రియలో పూర్తి పారదర్శకత పాటిస్తూ ప్రతి దశలో ప్రభుత్వ ఉత్తర్వులను ఖచ్చితంగా అమలు చేయాలని అధికారులకు దిశానిర్దేశం చేశారు.ప్రతి శాఖాధికారి తమ శాఖకు సంబంధించిన సమాచారాన్ని క్షుణ్ణంగా పరిశీలించి నిర్ణీత గడువులోగా సమర్పించాలని, శాఖల మధ్య సమన్వయంతో పనిచేస్తూ ఎలాంటి సమస్యలు తలెత్తినా వెంటనే ఉన్నతాధికారుల దృష్టికి తీసుకురావాలని కలెక్టర్ సూచించారు. జిల్లా స్థాయిలో అమలు ప్రక్రియలో ఎలాంటి జాప్యం చోటుచేసుకోకుండా అన్ని శాఖలు సమిష్టిగా కృషి చేయాలని ఆదేశించారు.సమావేశంలో ప్రెసిడెన్షియల్ ఉత్తర్వులు--2025 అమలుకు సంబంధించిన ప్రభుత్వ మార్గదర్శకాలు, స్థానిక కేడర్ల ఏర్పాటు, జిల్లా, జోనల్, మల్టీ జోనల్ స్థాయిలో ఉద్యోగుల కేటాయింపు విధానం, అమలు కాలపట్టిక తదితర అంశాలపై అధికారులకు సమగ్ర అవగాహన కల్పించారు.ఈ సమావేశంలో జాయింట్ కలెక్టర్ ఎస్. ప్రశాంత్ కుమార్, ఓఎస్డీ జావలి, ఆర్డీఓ కె. స్వాతి, డీఎస్పీ అశ్రఫ్ అలీ, జిల్లా రెవెన్యూ అధికారి పి. అంబేద్కర్, ఆర్జేడీ నాగమణి, వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

# అంగరంగ వైభవంగా శ్రీ జగన్నాథ స్వామివారి రథోత్సవం








**పెన్ పవర్ । ద్వారకాతిరుమల । జూలై 16**

చిన్న తిరుపతిగా ప్రసిద్ధి చెందిన ద్వారకాతిరుమలలో శ్రీ జగన్నాథ స్వామివారి రథోత్సవం గురువారం అత్యంత వైభవంగా, భక్తిశ్రద్ధల నడుమ ఘనంగా నిర్వహించారు. మంగళ వాయిద్యాలు, వేద మంత్రోచ్ఛారణలు, భక్తుల జయజయధ్వానాల మధ్య స్వామివారు రథాన్ని అధిరోహించి పురవీధుల్లో ఊరేగుతూ భక్తులకు దివ్య దర్శనం ఇచ్చారు.

ఉదయం నుంచే ఆలయానికి వేలాదిగా తరలివచ్చిన భక్తులతో ఆలయ ప్రాంగణం కిక్కిరిసిపోయింది. ప్రత్యేక పూజలు, నిత్యకైంకర్యాల అనంతరం అర్చకులు ఉత్సవమూర్తులను సుందరంగా అలంకరించిన రథంపై కొలువుదీర్చారు. అనంతరం "గోవిందా... గోవిందా..." అంటూ భక్తులు నినాదాలు చేస్తూ రథాన్ని భక్తిశ్రద్ధలతో లాగారు.

రథం పురవీధుల్లో సంచరిస్తుండగా భక్తులు స్వామివారికి హారతులు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. ఈ రథోత్సవంలో పాల్గొని స్వామివారిని దర్శించుకుంటే సంతానప్రాప్తి, సకల శుభాలు కలుగుతాయని భక్తుల విశ్వాసం.

స్థానికులతో పాటు చుట్టుపక్కల ప్రాంతాల నుంచి భారీ సంఖ్యలో భక్తులు తరలిరావడంతో ద్వారకాతిరుమల వీధులన్నీ జనసంద్రంగా మారాయి. భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా దేవస్థానం అధికారులు తాగునీరు, క్యూలైన్లు, పారిశుధ్యం, భద్రత తదితర ఏర్పాట్లు చేశారు. పోలీసు సిబ్బంది కట్టుదిట్టమైన బందోబస్తు నిర్వహించి రథోత్సవం ప్రశాంతంగా, విజయవంతంగా ముగిసేలా చర్యలు చేపట్టారు.



01
ఇప్పుడు పెన్ పవర్ దిన పత్రికలో
క్లాసిఫైడ్ యాడ్స్
కేవలం
యాడ్ 100/-కే
' ఐదు రోజులకు '
'4 సెం.మీ 4 సెం.మీ'
'మరిన్ని వివరాలకు సంప్రదించండి '
93948 55244
షరతులు వర్తిస్తాయి


# పోలవరం ప్రాజెక్టు సందర్శనకు బిజెపి భారీ ర్యాలీ

**రాజమహేంద్రవరం, పెన్ పవర్ , జూలై 15:** పోలవరం ప్రాజెక్టు సందర్శనకు కేంద్ర మంత్రి, రాష్ట్ర మంత్రి, ఎంపీ, ఎమ్మెల్సీ, బిజెపి నాయకులు, కార్యకర్తలు, ప్రజాప్రతినిధులతో గురువారం భారీ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఉదయం 9 గంటలకు ఎంపీ శ్రీమతి దగ్గుబాటి పురందేశ్వరి నివాసం జేఎన్ రోడ్డులోని చెరుకూరి ఫంక్షన్ హాల్ నుంచి ర్యాలీ ప్రారంభమయింది. రామాలయం సెంటర్, వాజ్‌పేయి సెంటర్, గోరక్షణపేట, అబ్దుల్ కలాం సెంటర్, వివేకానంద సెంటర్ (కంబాల చెరువు), సీతంపేట జంక్షన్, పేపర్ మిల్లు, కాతేరు, తిరుమల రోడ్డు, తొర్రేడు, సీతానగరం, పురుషోత్తపట్నం మీదుగా ప్రాజెక్టు ప్రాంతానికి చేరుకుంటుందని ఎంపీ తెలిపారు. ఈ ర్యాలీలో కేంద్ర మంత్రి భూపతిరాజు శ్రీనివాస్ వర్మ, రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి సత్య కుమార్ యాదవ్, పార్లమెంట్ సభ్యురాలు దగ్గుబాటి పురందేశ్వరి, ఎమ్మెల్సీ సోము వీర్రాజు,

భారతీయ జనతా పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్,రాష్ట్రానికి చెందిన ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ఇతర ప్రజాప్రతినిధులు, రాష్ట్ర పదాధికారులు, జిల్లా అధ్యక్షులు, నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొంటారని ఎంపీ తెలిపారు.పోలవరం ప్రాజెక్టు నిర్మాణ పురోగతిని పరిశీలించడంతో పాటు ప్రాజెక్టు అభివృద్ధి, పర్యాటక అవకాశాలు, కేంద్రం నుంచి అవసరమైన సహకారంపై జాతీయ నాయకత్వం దృష్టికి తీసుకెళ్లే ఉద్దేశంతో ఈ సందర్శన యాత్ర నిర్వహిస్తున్నట్లు ఎంపీ దగ్గుబాటి పురంధరేశ్వరి తెలిపారు.



# కేంద్ర, రాష్ట్ర మంత్రులకు పోలవరం జిల్లాలో ఘన స్వాగతం


- గండి పోచమ్మ అమ్మవారిని దర్శించుకున్న ప్రజాప్రతినిధులు
- పునరావాస పనుల పురోగతిని వివరించిన కలెక్టర్ దినేష్ కుమార్

**గంగవరం /దేవీపట్నం, పెన్ పవర్, జూలై 16:** పోలవరం ప్రాజెక్టు ప్రాంతాన్ని పరిశీలించేందుకు గురువారం పోలవరం జిల్లాకు విచ్చేసిన కేంద్ర భారీ పరిశ్రమలు, ఉక్కు శాఖ సహాయ మంత్రి భూపతిరాజు శ్రీనివాస వర్మ, రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్, రాజమహేంద్రవరం ఎంపీ దగ్గుబాటి పురందేశ్వరి తదితర ప్రజాప్రతినిధులకు జిల్లా కలెక్టర్ కె. దినేష్ కుమార్ ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా దేవీపట్నం మండలంలోని శ్రీ శ్రీ శ్రీ గండి పోచమ్మ అమ్మవారి ఆలయంలో కేంద్ర, రాష్ట్ర మంత్రులు ప్రత్యేక పూజలు నిర్వహించి అమ్మవారిని దర్శించుకున్నారు. ఆలయ అధికారులు వారికి ఆలయ సంప్రదాయాల ప్రకారం స్వాగతం పలికి తీర్థప్రసాదాలు అందజేశారు. అనంతరం జిల్లా కలెక్టర్ కె. దినేష్ కుమార్ అమ్మవారి చిత్రపటాన్ని జ్ఞాపికగా అందించి సత్కరించారు. ఆ తర్వాత పోలవరం ప్రాజెక్టు పునరావాస కాలనీల్లో కల్పించిన మౌలిక సదుపాయాలు, నిర్వాసితుల పునరావాస కార్యక్రమాల పురోగతి, హైడ్రో పవర్ ప్రాజెక్టుకు సంబంధించిన కీలక అంశాలను కలెక్టర్ కేంద్ర, రాష్ట్ర మంత్రులకు వివరించారు. ప్రాజెక్టు పనుల పురోగతి, ప్రజలకు కల్పిస్తున్న సదుపాయాలపై అధికారులు సమగ్ర సమాచారం అందించారు. ఈ కార్యక్రమంలో ఎంపీ దగ్గుబాటి పురందేశ్వరి, ఎమ్మెల్సీ సోము వీర్రాజు, ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు పి.వి.ఎన్. మాధవ్, జాయింట్ కలెక్టర్ సూరపాటి ప్రశాంత్ కుమార్, రంపచోడవరం ఆర్డీవో కె. స్వాతి, వివిధ శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

# మెడికల్ క్యాంపు నిర్వహణ



**జీలుగుమిల్లి, పెన్ పవర్, జులై 16;** ఎల్నోవా ప్రభావంతో వాతావరణ మార్పులు కారణంగా ప్రజలు తగు జాగ్రత్తలు తీసుకోవాలని జీలుగుమిల్లి పిహెచ్సి సిహెచ్ఓ శ్రీనివాసరాజు సూచించారు. గురువారం దాట్లవారిగూడెం గ్రామంలో వైద్యాధికారి మణికంఠేశ్వర ఆదేశాల మేరకు మెడికల్ క్యాంపు నిర్వహించారు. ఉపాధి హామీ కార్మికుల వద్దకు వెళ్లి సుమారు 72 మందికి పరీక్షించి జలుబు, దగ్గు ఉన్నవారికి మందులు పంపిణీ చేయడం జరిగింది. ఓ ఆర్ ఎస్ ప్యాకెట్లు పంపిణీ చేశారు. వసతి గృహంలో ఉన్న విద్యార్థులకు రాపిడ్ టెస్ట్ చేశారు. ఈ కార్యక్రమంలో హెచ్ వి ఆదిలక్ష్మి, హెల్త్ అసిస్టెంట్ కురం ప్రసాదు, సిబ్బంది శ్రావణి, కృష్ణవేణి, జగదాంబ, నాగరత్నం, పార్వతి ,ఆదిలక్ష్మి పాల్గొన్నారు.

# ముద్రగడ పద్మనాభం మృతి రాష్ట్రానికి తీరని లోటు -- వడ్డీ రఘురాం నాయుడు



**తాడేపల్లిగూడెం, పెన్ పవర్ జూలై 16:** ప్రముఖ కాపు ఉద్యమ నేత, మాజీ మంత్రి, మాజీ ఎమ్మెల్యే ముద్రగడ పద్మనాభం మృతి పట్ల వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ తాడేపల్లిగూడెం నియోజకవర్గ సమన్వయకర్త వడ్డీ రఘురాం నాయుడు ప్రగాఢ సంతాపం వ్యక్తం చేశారు. ముద్రగడ పద్మనాభం మరణం రాష్ట్ర రాజకీయాలకు, ముఖ్యంగా కాపు సామాజిక వర్గానికి తీరని లోటని ఆయన పేర్కొన్నారు. ప్రజాప్రతినిధిగా, మంత్రిగా, శాసనసభ్యుడిగా ఆయన నిర్వహించిన ప్రతి పదవికి తన నిజాయితీ, నిబద్ధత, ప్రజాసేవతో ప్రత్యేక వన్నె తీసుకొచ్చారని కొనియాడారు. కాపు సామాజిక వర్గం హక్కులు, రిజర్వేషన్లు, సంక్షేమం కోసం ఆయన జీవితాంతం అలుపెరగని పోరాటం చేశారని అన్నారు. ప్రజా సమస్యలపై రాజీపడని నాయకుడిగా, ఉద్యమ స్ఫూర్తికి ప్రతీకగా నిలిచిన ముద్రగడ పద్మనాభం సేవలు చిరస్మరణీయమని పేర్కొన్నారు. ప్రజా జీవితంలో విలువలు, నిబద్ధత, ధైర్యసాహసాలతో ప్రత్యేక గుర్తింపు పొందిన ఆయన, తరతరాలకు స్ఫూర్తిగా నిలిచే నాయకుడని రఘురాం నాయుడు అన్నారు. ముద్రగడ పద్మనాభం ఆత్మకు శాంతి చేకూరాలని భగవంతుడిని ప్రార్థిస్తూ, వారి కుటుంబ సభ్యులకు తన ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు

# గ్రామ దేవత శ్రీశ్రీశ్రీ బలుసులమ్మ తల్లి శాకంబరి అలంకారంతో సుభిక్షం :ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్






**తాడేపల్లిగూడెం,పెన్ పవర్. జులై 16:**గ్రామ దేవత శ్రీశ్రీశ్రీ బలుసులమ్మవారికి శాకంబరి అలంకరణతో సమాజం సుభిక్షంగా ఉంటుందని, ప్రతిఒక్కరూ శాకంబరి అలంకారాన్ని దర్శించుకుని అమ్మవారి ఆశీస్సులు పొందాలని శాసన సభ్యులు, రాష్ట్ర ప్రభుత్వ విప్ బొలిశెట్టి శ్రీనివాస్ అన్నారు. ఎమ్మెల్యే స్థానిక కార్యాలయంలో శ్రీ బలుసులమ్మ వారి ఆలయ నిర్వాహకులు శ్రీ రంగం అంజి బాబు, నీలం సురేష్ బృందం ఎమ్మెల్యేను గురువారం మర్యాద పూర్వకంగా కలిశారు.జులై 17, శుక్రవారం రోజు శాకంబరి అలంకరణ ఉత్సవాలకు ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ అలంకరణ కు సహకరించిన నీరుల్లి, కూరగాయల వర్తక సంఘాలవారిని అభినందించారు. హిందూ సంప్రదాయాల పరిరక్షణకు, సనాతన ధర్మాచరణకు శాఖంబరి అలంకరణ వంటి ఉత్సవాలు దోహదం చేస్తాయన్నారు. అమ్మవారి ఆలయంలో నిరంతరం ఆధ్యాత్మిక కార్యక్రమాలు నిర్వహించి, సమాజ క్షేమం కోసం కృషి చేయాలని ఆలయ నిర్వహకులను కోరారు.

# పర్మిషన్ 33 చెట్లకు, నరికింది 51 చెట్లు


- చోద్యం చూస్తున్న అటవీ శాఖ సిబ్బంది
- డి ఎఫ్ ఓ, స్క్వాడ్ తనిఖీలు
- ఎవరెవరిపై వేటు పడనుందో?




**వై రామవరం,పెన్ పవర్,జూలై 16 :** జిల్లా స్థాయి అధికారులు అనుమతితో పట్టా భూమిలో ఉన్న 33 మారుజాతి కలప చెట్లు నరుకుటకు అనుమతించగా, 51 చెట్లు నరికారని అటవీ శాఖ సిబ్బంది తెలిపారు.

మండలంలో యార్లగడ్డ పంచాయతీ గొరమంద గ్రామంలో వై రామవరం సెక్షన్, వై. రామవరం బీటులో గిరిజన రైతు పట్టా భూమిలో ఉన్న చెట్లను తొలగించుటకు కలెక్టర్ పర్మిషన్ ఇచ్చారని, చెట్లను నరుకుటకు అటవీ శాఖ అనుమతి ఇచ్చామని అడ్డతీగల సబ్ డి ఎఫ్ ఓ సుబ్బారెడ్డి తెలిపారు. పర్మిషన్ ఇచ్చిన చెట్ల కన్నా 18 చెట్లు ఎక్కువ నరికారని, దీనిపై డిఎఫ్ఓ, అటవీ శాఖ స్క్వాడ్ తనిఖీలు నిర్వహించారని తెలిపారు. దీనిపై సిబ్బంది నిర్లక్ష్యం కాన వస్తుందని ఆయన అన్నారు. అధికారులు ఎంక్వయిరీ రిపోర్ట్ వ్రాసుకుని వెళ్లారని తెలిపారు. రిపోర్ట్ అందిన తర్వాత ఎవరెవరిపై చర్యలు తీసుకున్నారో తెలుస్తుందని సిబ్బంది తెలిపారు.

# డిగ్రీ కాలేజ్ లెక్చరర్ గా దుంపల. అయ్యప్ప...



**అడ్డతీగల,పెన్ పవర్, జూలై 16;** అడ్డతీగల గురుకుల పాఠశాలలో ప్రస్తుతం ఉపాధ్యాయుడు గా విధులు నిర్వహిస్తున్న దుంపల. అయ్యప్ప ఆంధ్రప్రదేశ్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ నిర్వహించిన డిగ్రీ కాలేజీ లెక్చరర్ల ఎంపిక పోటీ పరీక్షల్లో జోన్-1 పరిధిలో ఎకనామిక్స్ లెక్చరర్ గా విజయం సాధించారు. ఈయన సాధారణ వ్యవసాయ కుటుంబానికి చెందిన వ్యక్తి ఈయన పాఠశాల విద్యాభ్యాసం నుండి యూనివర్సిటీ స్థాయి వరకు ప్రభుత్వ విద్యాసంస్థల్లోనే చదివి ఇంతటి ఘనత సాధించడం విశేషం, ఇంతటి విజయాన్ని సాధించిన అయ్యప్పను తోటి ఉపాధ్యాయులు, ప్రిన్సిపాల్ ప్రభాకర్ అభినందించారు.

# ముఖ్యమంత్రి పర్యటన పేరుతో హడావుడి పనులు కాదు..

- పోలవరం జిల్లా అభివృద్ధిపై చిత్తశుద్ధి చూపాలి
- సీపీఎం రంపచోడవరం ప్రాంతీయ కమిటీ డిమాండ్




**గంగవరం /రంపచోడవరం, పెన్ పవర్, జూలై 16:** ఈ నెల 22న ముఖ్యమంత్రి రంపచోడవరం పర్యటన నేపథ్యంలో ప్రభుత్వం చేపడుతున్న తాత్కాలిక పనులను నిలిపివేసి, నూతన పోలవరం జిల్లా శాశ్వత అభివృద్ధిపై దృష్టి సారించాలని సీపీఎం రంపచోడవరం ప్రాంతీయ కమిటీ డిమాండ్ చేసింది. ఈ మేరకు కమిటీ కన్వీనర్ మట్ల వాణిశ్రీ గురువారం విడుదల చేసిన ప్రకటనలో మాట్లాడుతూ, ముఖ్యమంత్రి పర్యటన పేరుతో రాత్రికి రాత్రే రోడ్లకు ప్యాచ్‌వర్క్‌లు చేయడం, రంగులు వేయడం వంటి హడావుడి పనులు కాకుండా, జిల్లాలో పెండింగ్‌లో ఉన్న అభివృద్ధి కార్యక్రమాలను పూర్తి చేయాలని కోరారు. పోలవరం ప్రాజెక్టు నిర్వాసితులకు ఆర్‌అండ్‌ఆర్ ప్యాకేజీల అమలు, పునరావాస కాలనీల్లో కనీస మౌలిక సదుపాయాల కల్పన ఇప్పటికీ పూర్తి కాలేదని పేర్కొన్నారు. నిర్వాసితులకు పూర్తి న్యాయం చేయాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందన్నారు.

రంపచోడవరం ఏజెన్సీ ప్రాంతంలోని గిరిజన గ్రామాల్లో రహదారులు, తాగునీటి సదుపాయాలు, మెరుగైన వైద్య సేవలు ఇంకా అందుబాటులో లేవని, సూపర్ స్పెషాలిటీ వైద్య సేవల కొరతతో గిరిజనులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. అలాగే స్థానిక గిరిజన యువతకు ఉపాధి అవకాశాల కల్పనలో, ఏజెన్సీ ప్రాంత విద్యాసంస్థల అభివృద్ధిలో ప్రభుత్వం విఫలమైందని విమర్శించారు. ముఖ్యమంత్రి పర్యటనను కేవలం ప్రచార కార్యక్రమంగా పరిమితం చేయకుండా, పోలవరం జిల్లా ఎదుర్కొంటున్న ప్రధాన సమస్యలపై సమగ్ర సమీక్ష నిర్వహించి, జిల్లా అభివృద్ధికి అవసరమైన నిధులను బడ్జెట్‌లో కేటాయించి శాశ్వత పనులు చేపట్టాలని సీపీఎం ప్రాంతీయ కమిటీ డిమాండ్ చేసింది. లేనిపక్షంలో ప్రజా సమస్యల పరిష్కారం కోసం పెద్దఎత్తున ఆందోళనలు చేపడతామని హెచ్చరించింది.

# శ్రీ బలుసులమ్మ అమ్మవారిని దర్శించుకున్న కోలీవుడ్ స్టార్ కమెడియన్ హీరో యోగి బాబు.





**తాడేపల్లిగూడెం. పెన్ పవర్. జూలై 16.** ఆలయానికి విచ్చేసిన స్టార్ కమెడియన్ హీరో యోగిబాబు కి తాడేపల్లిగూడెం ఎమ్మెల్యే తనయులు జనసేన యూత్ ఐకాన్ బొలిశెట్టి రాజేష్ మరియు ఆలయ చైర్మన్ శ్రీరంగం రామాంజనేయులు, ఆలయ కమిటీ సభ్యులు ఆయనకు ఆహ్వానం పలికారు.తమిళ్ మరియు తెలుగు చిత్ర పరిశ్రమలో అత్యంత ప్రజాదరణ పొందిన ప్రముఖ హస్య నటుడు కోలీవుడ్ స్టార్ కమెడియన్ యోగిబాబు తాడేపల్లిగూడెం పట్టణ ఇలవేల్పు శ్రీ బలుసులమ్మ అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. దర్శనానంతరం అమ్మవారి ప్రాముఖ్యత తెలియజేసి అమ్మవారి చిత్రపటాన్ని మరియు తీర్థ ప్రసాదాలను ఆలయ చైర్మన్ శ్రీరంగం రామాంజనేయులు అందజేశారు. ఇటీవలే నాగ శౌర్య తో హిట్ కొట్టిన తాడేపల్లిగూడెం వాసి పవన్ భాసంశెట్టి దర్శకత్వంలో ఈయన నటిస్తున్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

# చిన్నారికి వైద్యసహాయం అందించిన ఎమ్మెల్యే బొలిశెట్టి, జనసైనికులు



**తాడేపల్లిగూడెం,పెన్ పవర్. జూలై 16:** కంటి క్యాన్సర్ తో బాధపడుతున్న చిన్నారి వైద్యం నిమిత్తం శాసనసభ్యులు, రాష్ట్ర ప్రభుత్వ విప్ బొలిశెట్టి శ్రీనివాస్ సొంత నిధులు రూ. 20వేలు ఆర్ధిక సహకారం అందించారు. జనసైనికులు రూ. 1,30,000లు కలిపి మొత్తం రూ. 1,51,000లు స్థానిక ఎమ్మెల్యే కార్యాలయంలో గురువారం ఎమ్మెల్యే చేతుల మీదుగా బాధిత చిన్నారి కుటుంబానికి అందజేశారు. పడమర విప్పరు గ్రామానికి చెందిన పెనుమూలు ఏసు రాజు కుమార్తె 15 నెలల చిన్నారి పెనుమూలు నేహశ్రీ కి కంటి క్యాన్సర్ వైద్యం నిమిత్తం ఈ ఆర్థిక సహాయం చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ చిన్నారి వైద్యం నిమిత్తం ఆర్ధిక సహకారం అందించిన జనసైనికులను అభినందించారు. వివిధ రకాల సమస్యలతో బాధపడే ప్రజలకు సేవలు అందించే నిమిత్తం జనసేన కార్యాలయం ఎల్లవేళలా అందుబాటులో ఉంటుందని తెలియజేశారు. ఈ ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పి.జి.ఆర్.ఎస్)లో ప్రతి రోజూ ఉదయం 10గంటల నుంచి మధ్యాహ్నం 1గంటల వరకు ప్రజల నుంచి ఫిర్యాదులు స్వీకరించి పరిష్కరిస్తారని తెలిపారు. ప్రజలకు నిరంతర సేవలు అందించే నిమిత్తం ఆరుగురు సిబ్బందిని నియమించామని తెలిపారు. జనసేన అధ్యక్షులు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ఆశయాల మేరకు జన సైనికులు సేవా కార్యక్రమాలు కొనసాగించాలని కోరారు. రాజకీయమంటే అధికారం కోసం కాకుండా ప్రజలకు సేవలందించడమే లక్ష్యంగా జనసేన కృషి చేస్తుందని అన్నారు. చిన్నారి వైద్యానికి సహకారం అందించిన ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్ కు, జనసైనికులకు పెనుమూలు కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో పడమరవిప్పర్రు జనసేన నాయకులు, పెంటపాడు మండల జనసేన అధ్యక్షుడు పుల్లా బాబి, గంటా సుబ్రహ్మణ్యం, పసల శ్రీకృష్ణ, జనసేన నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

# సిల్లి రాయుడు కుటుంబానికి జనసేన నాయకుడు తలపంటి బుజ్జి అండ....

**50 కేజీల బియ్యం, ఆర్థిక సాయం అందించి కష్టకాలంలో బాధిత కుటుంబానికి భరోసా**



**శంఖవరం పెన్ పవర్ జులై 16:**–కాకినాడ జిల్లా ప్రత్తిపాడు నియోజకవర్గం శంఖవరం మండలం నెల్లిపూడి గ్రామానికి చెందిన సిల్లి రాయుడు ఇటీవల అనారోగ్యంతో మృతి చెందగా ఆయన కుటుంబాన్ని మండల జనసేన పార్టీ ఉపాధ్యక్షుడు తలపంటి బుజ్జి పరామర్శించారు.సిల్లి సత్యవతి, నాని, తాతాబ్బాయి తదితర కుటుంబ సభ్యులను కలిసి ఆయన ప్రగాఢ సానుభూతి తెలిపారు. అనంతరం కుటుంబానికి 50 కేజీల బియ్యంతో పాటు ఆర్థిక సహాయాన్ని అందజేసి అండగా నిలిచారు.ఈ కార్యక్రమంలో తలపంటి వీరబాబు,పీర్ల నాని,సికోలు రాజబాబు, శివకోటి ప్రసాద్, చిట్టుమూరి కామరాజు, కానేటి అభి, కోరాడ జాను, రాచపల్లి శ్రీను,నొక్కి వీరబాబు, మద్దిల రాజబాబు, కోరాడ పెద్దబాబు, నెల్లిపూడి గ్రామ జనసేన నాయకులు,కార్యకర్తలు పాల్గొన్నారు.

# సంపద సృష్టిస్తానన్న చంద్రబాబు రాష్ట్రాన్ని అమ్మేస్తున్నారు


- రాందేవ్ బాబా కు 70 ఎకరాల భూమి
- మాజీ ఎంపీ జీ.వి హర్ష కుమార్ ఆరోపణ
- రాజమహేంద్రవరం, పెన్ పవర్, జూలై 16
- మాజీ ఎంపీ జీ.వి హర్ష కుమార్ ఆరోపణ



**రాజమహేంద్రవరం, జూలై 16 :** రాష్ట్రంలో సంపద సృష్టిస్తానన్న ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు రాష్ట్ర సంపదను అమ్మేస్తున్నారని విమర్శించారు. ప్రభుత్వం ఏర్పడి రెండు సంవత్సరాల అయినప్పటికీ కంపెనీలకు భూములు ఇచ్చిన చంద్రబాబు ఉద్యోగాలు కూడా ఇవ్వలేదని విమర్శించారు. రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ప్రభుత్వ భూములను తనకు కావలసిన వారికి పంపిణీ చేస్తున్నారని మాజీ ఎంపీ జీవి హర్ష కుమార్ అన్నారు. గురువారం రాజీవ్ గాంధీ డిగ్రీ కాలేజీలో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాందేవ్ బాబా పతాంజలి ఉత్పత్తులపై ఆరోపణలు ఎదుర్కొని,సుప్రీంకోర్టుకు క్షమాపణలు చెప్పిన రాందేవ్ బాబా కు విజయనగరం జిల్లా కొత్తవలస గ్రామం వద్ద 70 ఎకరాల భూమిని,రూ 130 కోట్ల రూపాయలు సబ్సిడీగా ప్రభుత్వ ఇచ్చిందని అన్నారు. చంద్రబాబు నాయుడు తనకు కావలసిన వారికి భూములు ఇచ్చి ప్రజల కడుపులు కొడుతున్నారని ఆరోపించారు. న్యూయార్క్ సిటీలో డేటా సెంటర్లను నిషేధించారని తెలిపారు. రాష్ట్రంలో డేటా సెంటర్లకు భూములు, కరెంటు సబ్సిడీల రూపంలో నగదు చెల్లిస్తున్నారన్నారు. జగన్ గతంలో రాందేవ్ బాబాకు 30 ఎకరాలు ఇచ్చారని . బిజెపి వారికి చంద్రబాబు, జగన్ లు భూములు ఇచ్చేస్తారని తెలిపారు. టిడిపి, వైసిపి , జనసేన కు వేసిన ఓట్లు బిజెపికి వెళ్తాయని వివరించారు. ఒకరిపై ఒకరు ఆరోపణలు చేసుకుని ప్రజా సమస్యలు పట్టించుకోరని విమర్శించారు. కూటమి ప్రభుత్వంమెడికల్ కాలేజీలను ప్రైవేట్ పరం చేస్తున్నాదని తెలిపారు. జగన్ ప్రభుత్వం మెడికల్ కాలేజీలో 50 శాతం సీట్లను అమ్ముకొని, మిగిలిన 50 శాతం సీట్లు రిజర్వేషన్ ప్రాతిపదికన భర్తీ చేశారని అన్నారు. 2019 నుంచి ఇప్పటివరకు రాష్ట్రం లోని ప్రైవేటు విద్యా సంస్థలకు రూ 6 వేల కోట్ల రూపాయలు ఫీజు రియంబర్స్మెంట్ బకాయిలు చెల్లించలేదని తెలిపారు. రాష్ట్రంలో ఆరోగ్యశ్రీ పథకం అందడం లేదని అన్నారు. విద్య, వైద్యం ప్రజలకు భారం గా మారిందని అన్నారు. రాష్ట్రంలో సంపద సృష్టిస్తానన్న ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు సంపదను అమ్మేస్తున్నారని విమర్శించారు. ప్రభుత్వం ఏర్పడి రెండు సంవత్సరాల అయినప్పటికీ కంపెనీలకు భూములు ఇచ్చిన చంద్రబాబు ఒక్క ఉద్యోగం కూడా ఎవరికీ ఇవ్వలేదని వివరించారు. కాపు సామాజిక వర్గం నికి ముద్రగడ పద్మనాభం రక్తాన్ని ధారపోసారని నివాళులర్పించారు.

రాజానగరం మండలం యానాదుల పేటలో గత 20 సంవత్సరాల కాలంగా లేని కరెంటు , మంచి నీటి వసతి లేదని నిరాహార దీక్ష చేస్తానని హెచ్చరించడంతో కరెంటు మంచినీటి సౌకర్యం కల్పించారని తెలిపారు.

ఆగస్టు 10 న దళిత క్రైస్తవులకు ఎస్సీ హోదా కల్పించాలని కోరుతూ ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద ఆందోళన నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కోస్తా ఆంధ్ర ప్రాంతాల నుంచి దళిత క్రైస్తవులను పెద్ద ఎత్తున తరలించి ఆందోళన కార్యక్రమంలో పాల్గొంటామని అన్నారు. మతాలు మారిన సిక్కులకు, బౌద్ధులకు ఎస్సీ హోదా కల్పించినప్పుడు క్రిస్టియన్లకు మాత్రం ఎందుకు కల్పించకూడదని ప్రశ్నించారు. జస్టిస్ సచార్ కమీషన్ , జస్టిస్ రంగనాథ మిశ్ర కమిషన్ల నివేదికల ఆధారంగా దళిత క్రైస్తవులకు ఎస్సీ హోదా కల్పించాలని డిమాండ్ చేశారు.






# ముద్రగడ మృతికి సంతాపం వ్యక్తం చేసిన వరసాల ప్రసాద్, గాజింగం సత్తిబాబు





**గోకవరం పెన్ పవర్ జులై 16:–** ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ మంత్రివర్యులు కాపు ఉద్యమ నేత అంబేద్కర్ అందరివాడు అంటూ వెలుగెత్తి చాటిన మహోన్నత విలువలు కలిగిన వ్యక్తి ముద్రగడ పద్మనాభం మరణం చాలా బాధాకరమని గోకవరం మండలం దళిత నాయకులు వరసాల ప్రసాద్ అన్నారు. గురువారం గోకవరం ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘ చైర్పర్సన్ గాజింగి సత్తిబాబు, మాజీ ఎంపీటీసీ సభ్యులు, కాపు యువ నాయకుడు ముత్యం (వీర వెంకటరావు) నాని,మరో కాపుయువజన నాయకుడు పల్లెల రామకృష్ణ తో కలిసి కాకినాడ జిల్లా కిర్లంపూడి గ్రామంలోని మాజీ మంత్రి ముద్రగడ స్వగృహానికి చేరుకుని ముద్రగడ పద్మనాభం కుమారుడు బాలును పరామర్శించారు అనంతరం పద్మనాభంతో వీరికి ఉన్న అనుబంధాన్ని గుర్తుచేసుకొని కన్నీరు పెట్టుకున్నారు అనంతరం ముద్రగడ సమాధిని సందర్శించి పూల మాలలు వేసి శ్రద్ధాంజలి ఘటించారు. ఈ సందర్భంగా గాజింగి సత్తిబాబు మాట్లాడుతూ ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మంత్రిగా కాకినాడ పార్లమెంటు సభ్యునిగా నాలుగు పర్యాయాలు శాసనసభ్యునిగా తూర్పుగోదావరి జిల్లా కీర్తిని మరియు కాపు కులస్తులు సమాజంలో గౌరవం పొందేలా గుర్తింపు తీసుకువచ్చారని కాపులలో అణ గారిన వర్గాలు కూడా ఎంతో ఆర్థికంగా రాజకీయంగా అణిచివేతకు గురవుతున్న విషయాన్ని గ్రహించిన కాపు ఉద్యమం రాష్ట్రవ్యాప్తంగా చేపట్టి కాపులందరినీ మేల్కొల్పిన మహోన్నత వ్యక్తి అని అటువంటి వ్యక్తి నేడు లేకపోవడం బాధాకరమని ఆయన అన్నారు. ఈ సందర్భంగా ముద్రగడ్డ పద్మనాభం కుటుంబ సభ్యులకు సానుభూతిని తెలియజేస్తూ అధైర్య పడద్దని ఆంధ్రప్రదేశ్ అంతా మీ కుటుంబానికి రాజకీయాలకు అతీతంగా అండగా ఉంటామని వరసాల ప్రసాద్ గాజింగి సత్తిబాబు లు ముద్రగడ పద్మనాభం కుమారుడు బాలును ఓదార్చారు.

# కమ్యూనిటీ హాల్‌లో వాష్‌రూమ్ నిర్మాణానికి శంకుస్థాపన



**రాజమహేంద్రవరం, పెన్ వర్ , జూలై 16:** నగరంలోని మూడో వార్డు నెహ్రూనగర్ కమ్యూనిటీ హాల్ వద్ద వాష్‌రూమ్ సౌకర్యం లేక మహిళా డ్వాక్రా సంఘాల సభ్యులు సమావేశాల సందర్భంగా తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్న విషయాన్ని స్థానిక మహిళలు రాష్ట్ర శెట్టిబలిజ కార్పొరేషన్ చైర్మన్ కుడుపూడి సత్తిబాబు దృష్టికి తీసుకువచ్చారు. ఆయన నగర ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ (వాసు) దృష్టికి సమస్యను తీసుకెళ్లారు. విషయాన్ని తెలుసుకున్న ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ స్పందించి రూ. 3 లక్షల నిధులను మంజూరు చేయించారు. అనంతరం రాష్ట్ర శెట్టిబలిజ కార్పొరేషన్ చైర్మన్ కుడుపూడి సత్తిబాబు స్థానిక ప్రజాప్రతినిధులు, మహిళా సంఘాల సభ్యుల సమక్షంలో వాష్‌రూమ్‌తో పాటు అవసరమైన ఇతర అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ప్రజలకు అవసరమైన మౌలిక సదుపాయాల కల్పన కూటమి ప్రభుత్వ ప్రధాన లక్ష్యమన్నారు. మహిళలు సమావేశాలకు వచ్చే ప్రతి చోట కనీస సౌకర్యాలు ఉండేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు. ప్రజల సమస్యలను గుర్తించి వేగంగా పరిష్కరించేందుకు తాము కట్టుబడి ఉంటామన్నారు. మహిళా డ్వాక్రా సంఘాల సభ్యులు ఎదుర్కొంటున్న సమస్యను ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ దృష్టికి తీసుకెళ్లగానే స్పందించి నిధులు మంజూరు చేయించడం అభినందనీయమన్నారు

# ఎలినినో ప్రభావం పై రైతులకు అవగాహన



**జగ్గంపేట, పెన్ పవర్, జూలై 16:** ప్రస్తుతం ఉన్న వర్షాభావ పరిస్థితులు, పంట సాగులో పాటించాల్సిన మెళకువలపై రైతులకు అవగాహన కల్పిస్తున్నట్లు ఏడీఏ గరిమెళ్ల శ్రీనివాస్ తెలిపారు. ఆత్మ పథకంలో రైతులకు ప్రదర్శన క్షేత్రాల నిర్వాహణకు నిర్ణయం చేశామన్నారు. ఎల్ నినో ప్రభావం, తక్కువ వర్షపాతం, అధిక ఉష్ణోగ్రతల వల్ల పంట సాగు ఇబ్బందులు రావచ్చని తీసుకోవాల్సిన జాగ్రత్తలు వివరించారు. ప్రభుత్వం పంట భీమా సౌకర్యం కల్పించిందన్నారు. రైతులు పంట భీమా కోసం స్వీయ నిర్ధారణ చేసుకోవచ్చని అధికారుల చుట్టూ తిరగనవసరం లేదన్నారు. వరి ఎకరానికి రూ. 760, పత్తికి రూ. 2వేలు చెల్లించి ఇన్సూరెన్స్ చేసుకుంటే వాతావరణ పరిస్థితులకు అనుగుణంగా నష్టపరిహారం చెల్లిస్తారన్నారు. జూలై 24వతేదీ వరకు గడువు ఉందన్నారు. సమావేశంలో ఆత్మ డీవీడీ కె.బాబురావు, జగ్గంపేట వ్యవసాయాధికారి ఎస్. నరసింహం, గండేల్లి, ఏలేశ్వరం ఏవోలు, సిబ్బంది పాల్గొన్నారు.

# పోలవరం ప్రాజెక్టును త్వరితంగా పూర్తి చేసేందుకు కేంద్రం చేయూత






- పోలవరం జాతీయ ప్రాజెక్టు బిజెపి ప్రజాప్రతినిధుల సందర్శన
- ఆంధ్రప్రదేశ్ బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు పి.వి.ఎన్. మాధవ్

**రాజమహేంద్రవరం, పెన్ పవర్, జూలై 16:** జాతీయ ప్రాజెక్టుగా అమలవుతున్న బహుముఖ ప్రయోజనాల పోలవరం ప్రాజెక్టును త్వరిత గతిన పూర్తి చేసేందుకు కేంద్ర ప్రభుత్వం సహకరిస్తుందని ఆంధ్రప్రదేశ్ బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు పి.వి.ఎన్. మాధవ్ అన్నారు. 12 సంవత్సరాల మోడీ పాలన, రెండు సంవత్సరాల చంద్రబాబు పాలన ను దృష్టిలో పెట్టుకొని పోలవరం గురువారం ప్రాజెక్టు సందర్శించనున్నామని ఆయన తెలిపారు.

పోలవరం ప్రాజెక్ట్ పరిశీలన అనంతరం మాధవ్ మాట్లాడుతూ, 2014 లో ఎన్డీయే ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఈ ప్రాజెక్టుకు వేగం వచ్చిందన్నారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ వరద ప్రభావిత గ్రామాలన్నింటినీ ఆంధ్రప్రదేశ్‌లో విలీనం అయ్యేలా చేసి, ప్రాజెక్టు ముందుకు సాగేందుకు మార్గం సుగమం చేశారన్నారు. రాష్ట్ర పునర్విభజన చట్టంలో పోలవరం జాతీయ ప్రాజెక్టుగా మోడీ ప్రకటించి అందుకు సంబంధించి కేంద్రమే నిర్మించేలాగా నిధులు కేటాయించిం దన్నారు. ఈ మేరకు ఆర్డినెన్స్ తీసుకువచ్చి, రాష్ట్రపతి ఉత్తర్వులు జారీ చేసి, పర్యావరణ అనుమతులు సహా అవసరమైన అన్ని చట్టబద్ధ అనుమతులను కేంద్ర ప్రభుత్వం కల్పించిం దన్నారు.తదనంతరం పోలవరం ప్రాజెక్ట్ అథారిటీ ఏర్పాటు చేయబడిం దన్నారు. రాష్ట్ర ప్రభుత్వ పర్యవేక్షణలో కొనసాగించేందుకు కేంద్ర ప్రభుత్వం అనుమతించి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు నాయకత్వంలో ఈ ప్రాజెక్టు వేగంగా ముందుకు సాగి, అనేక కీలక పనులు పూర్తయ్యాయన్నారు. ప్రధాన స్పిల్‌వే పూర్తికాగా, ప్రస్తుతం ఎర్త్-కమ్-రాక్‌ఫిల్ డ్యామ్ నిర్మాణం కొనసాగుతోందన్నారు.

, కేంద్ర మంత్రి భూపతిరాజు శ్రీనివాస వర్మ, రాష్ట్ర మంత్రి సత్య కుమార్ యాదవ్, ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలతో కలిసి ఆంధ్రప్రదేశ్ బీజేపీ ప్రతినిధి బృందం పోలవరం ప్రాజెక్టును సందర్శించింది. జరుగుతున్న పనులు 85శాతం పురోగతి పై సంతృప్తి వ్యక్తం చేశారు. కుడి, ఎడమ కాలువల పనులు పూర్తయ్యా యన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు కృష్ణా-గోదావరి నదుల అనుసంధాన కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఆగస్టు 10 నుంచి ఎడమ కాలువ ద్వారా గోదావరి నీటిని అనకాపల్లికి విడుదల చేస్తామని ప్రకటించా రన్నారు. ఎడమ కాలువ వెంబడి జరుగుతున్న అభివృద్ధి పనులను, కేవెల్ బండ్, హెడ్ రెగ్యులేటర్ తదితర నిర్మాణాలను పరిశీలించామన్నారు. మిగిలిన పనులు కూడా త్వరలో పూర్తవుతా యన్నారు. ఈ ప్రాంతం పర్యాటక అభివృద్ధి కి ప్రాధాన్యత ఇస్తోంమన్నారు. ప్రాజెక్టు పూర్తయిన తర్వాత ఉత్తరాంధ్ర సుజల స్రవంతి పథకం ద్వారా ఉత్తరాంధ్రకు నీరు చేరుతుందన్నారు. ఈ ప్రాజెక్టు ద్వారా దాదాపు ఐదు లక్షల ఎకరాలకు సాగునీరు అందించి ఈ ప్రాంత రూపురేఖలను మార్చేస్తుందన్నారు.

విశాఖపట్నానికి తాగునీరు, పారిశ్రామిక అవసరాల కోసం సుమారు 23.44 టీఎంసీల నీరు సరఫరా జరుగుతుందన్నారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ సంపూర్ణ సహకారం వల్లే పోలవరం ప్రాజెక్టు విజయవంతంగా ముందుకు సాగుతోందన్నారు. గత ప్రభుత్వం లో పూర్తీ నిర్లక్ష్యం చేసిందన్ననారు. కేంద్ర ప్రభుత్వం ఈ ప్రాజెక్టు కోసం సుమారు రూ.30,500 కోట్లు కేటాయించిందన్నారు. అదనంగా, సుమారు రూ.4,500 కోట్ల వ్యయంతో 960 మెగావాట్ల జలవిద్యుత్ ప్రాజెక్టు నిర్మాణం జరుగుతోం దన్నారు. నావిగేషన్ కాలువ కూడా ప్రాజెక్టులో భాగంగా ఉందన్నారు.

ఈ ప్రాజెక్టు ఆధారంగా మరిన్ని సాగునీటి ప్రాజెక్టులు కూడా చేపట్టతామని తెలిపారు. పోలవరం కేవలం ఆంధ్రప్రదేశ్‌కే కాకుండా, కృష్ణా నదీ పరీవాహక ప్రాంతాన్ని స్థిరీకరిస్తుం దన్నారు. గోదావరి నుంచి సుమారు 80 టీఎంసీల నీటిని రాయలసీమకు మళ్లించడం ద్వారా ఆ ప్రాంతం సస్య శ్యామలం జరుగుతుందన్నారు. తెలంగాణ, కర్ణాటక, ఛత్తీస్‌గఢ్, ఒడిశా రాష్ట్రాలకు కూడా గోదావరి జలాల పంపిణీ ద్వారా ప్రయోజనం చేకూరుతుందన్నారు.

రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాలు సమన్వయంతో ఈ ప్రాజెక్టును పూర్తి చేసేందుకు కృషి చేస్తున్నాయన్నారు. ఈ సందర్భంగా ప్రాజెక్టు పనుల వివరాలను సమగ్రంగా వివరించిన మెయిల్ సంస్థకు ధన్యవాదాలు తెలిపారు. ఈ పర్యటన లో కేంద్ర మంత్రి భూపతి రాజు శ్రీనివాస్ వర్మ, రాష్ట్ర ఆరోగ్య శాఖ మంత్రి సత్య ప్రసాద్, ఎంపీ పురంధేశ్వరి, ఎం ఎల్ సి సోము వీర్రాజు, ఎం ఎల్ ఎ నల్లమిల్లి రామ కృష్ణ రెడ్డి, బీజేపీ జిల్లా అధ్యక్షుడు పీక్కి నాగేంద్ర, బిజెపి నేతలు, పదదికారులు తదితరులు పాల్గొన్నారు.

## రుడా పరిధి లో సమతుల్య అభివృద్ధే లక్ష్యం

రుడా 8వ బోర్డు సమావేశం లో చైర్మన్ బొడ్డు వెంకటరమణ చౌదరి



**రాజమహేంద్రవరం, పెన్ పవర్, జూలై 16**

రాజమహేంద్రవరం అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ 8వ బోర్డు సమావేశం గురువారం మున్సిపల్ కార్పొరేషన్ కాన్ఫరెన్స్ హాల్లో రుడా చైర్మన్ బొడ్డు వెంకటరమణ చౌదరి అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశంలో రుడా పరిధిలో చేపట్టాల్సిన అభివృద్ధి కార్యక్రమాలు, మౌలిక వసతుల విస్తరణ, పెండింగ్ ప్రతిపాదనలపై చర్చించి పలు నిర్ణయాలు తీసుకున్నారు.రుడా చైర్మన్ బొడ్డు వెంకటరమణ చౌదరి మాట్లాడుతూ, అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ పరిధిలో సమతుల్య అభివృద్ధే ప్రభుత్వ లక్ష్యమన్నారు. ప్రజలకు మెరుగైన పట్టణ మౌలిక వసతులు కల్పించే ప్రతి ప్రతిపాదనను అమలు చేసేలా అధికారులు చర్యలు తీసుకోవాలని సూచించారు. పెండింగ్‌లో ఉన్న అభివృద్ధి పనులను ప్రాధాన్యతతో పూర్తి చేయడంతో పాటు భవిష్యత్ ను దృష్టిలో ఉంచుకుని ప్రణాళికలు రూపొందించాలని ఆదేశించారు.

శాసనసభ్యుడు గోరంట్ల బుచ్చయ్య చౌదరి మాట్లాడుతూ, నగర అభివృద్ధికి దీర్ఘకాలిక ప్రణాళికలు అవసరమన్నారు. నగరంలో పెరుగుతున్న ట్రాఫిక్ సమస్యకు శాశ్వత పరిష్కారంగా బొబ్బిలంక--కడియం బైపాస్ రహదారి ప్రతిపాదనను త్వరితగతిన ముందుకు తీసుకెళ్లాలని సూచించారు. అంతర్జాతీయ ప్రమాణాలతో క్రికెట్ స్టేడియం నిర్మాణానికి తూర్పు రైల్వే స్టేషన్ సమీపంలో భూమి కేటాయింపును పరిశీలించాలని ప్రతిపాదించారు.

శాసనసభ్యులు ఆదిరెడ్డి శ్రీనివాస్, బత్తుల బలరామకృష్ణ, ముప్పిడి వెంకటేశ్వరరావు తమ తమ నియోజకవర్గాల్లో రుడా నిధులతో వివిధ అభివృద్ధి పనులకు ప్రతిపాదనలను సమావేశంలో వివరించారు. ప్రజల అవసరాలకు అనుగుణంగా మౌలిక సదుపాయాల కల్పనకు ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు.రుడా వైస్ ఛైర్‌పర్సన్, జాయింట్ కలెక్టర్ వై. మేఘా స్వరూప్ మాట్లాడుతూ, లేఅవుట్ రెగ్యులరైజేషన్ స్కీమ్ (ఎల్ఆర్ఎస్) కింద పెండింగ్‌లో ఉన్న దరఖాస్తులను పరిశీలించి పరిష్కరించేందుకు చర్యలు చేపడుతున్నామని తెలిపారు. ఆటోక్యాడ్ పరిజ్ఞానం కలిగిన ఇంజినీరింగ్ విద్యార్థులు, అర్హులైన వ్యక్తులను తాత్కాలికంగా నియమించి స్టైపెండ్ చెల్లించేందుకు బోర్డు ఆమోదం తెలిపిందన్నారు. అనుమతులు లేకుండా అభివృద్ధి చేసిన లేఅవుట్లను గుర్తించి, నిబంధనల ప్రకారం చట్టపరమైన చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు.ఈ సమావేశంలో శెట్టిబలిజ వెల్ఫేర్ కార్పొరేషన్ ఛైర్మన్ కుడిపూడి సత్తిబాబు, రుడా బోర్డు సభ్యులు, వివిధ శాఖల ప్రత్యేక ఆహ్వానితులు, రుడా సెక్రటరీ, చీఫ్ ప్లానింగ్ ఆఫీసర్, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## ముఖ్యమంత్రి పర్యటన విజయవంతానికి పకడ్బందీ ఏర్పాట్లు చేయాలి

అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని కలెక్టర్ కె. దినేష్ కుమార్ ఆదేశం





**గంగవరం /రంపచోడవరం, పెన్ పవర్ జూలై 16** : ఈ నెల 24న పోలవరం జిల్లాలో జరగనున్న రాష్ట్ర ముఖ్యమంత్రి పర్యటనను విజయవంతం చేసేందుకు అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేసి, ఎలాంటి లోపాలకు తావు లేకుండా ఏర్పాట్లు పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ కె. దినేష్ కుమార్ ఆదేశించారు.గురువారం రాత్రి స్థానిక ఐటీడీఏ సమావేశ మందిరంలో జిల్లా జాయింట్ కలెక్టర్ ఎస్. ప్రశాంత్ కుమార్, ఓఎస్డీ జావలి, ఆర్డీఓ స్వాతి, ఏఎస్పీ అశ్రఫ్ అలీతో కలిసి వివిధ శాఖల అధికారులతో నిర్వహించిన సమీక్ష సమావేశంలో కలెక్టర్ ఏర్పాట్లపై దిశానిర్దేశం చేశారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, ముఖ్యమంత్రి పాల్గొనే లిమెగా పేరెంట్-- టీచర్ మీటింగ్ (విద్యార్థుల తల్లిదండ్రుల ఆత్మీయ సమావేశం)లికు సంబంధించిన అన్ని ఏర్పాట్లు ప్రభుత్వ ప్రతిష్ఠకు తగిన విధంగా పూర్తి చేయాలని సూచించారు. ప్రతి శాఖకు అప్పగించిన బాధ్యతలను నిర్ణీత గడువులో పూర్తి చేసి, శాఖల మధ్య సమన్వయంతో వ్యవహరించాలని అధికారులకు సూచించారు.వేదిక ఏర్పాట్లు, ట్రాఫిక్ నియంత్రణ, భద్రత, తాగునీరు, విద్యుత్, పారిశుద్ధ్యం, వైద్య సేవలు, అగ్నిమాపక సదుపాయాలు, పార్కింగ్, మీడియా గ్యాలరీ, మరుగుదొడ్లు, తాత్కాలిక షెడ్లు తదితర ఏర్పాట్లపై ప్రత్యేక దృష్టి సారించాలని ఆదేశించారు. క్షేత్రస్థాయిలో ఏర్పాట్లను నిరంతరం పర్యవేక్షిస్తూ ఎప్పటికప్పుడు నివేదికలు అందించాలని, ఏ చిన్న సమస్య వచ్చినా వెంటనే పరిష్కరించాలని సూచించారు.ఏర్పాట్లలో నిర్లక్ష్యం ప్రదర్శించే అధికారులపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించిన కలెక్టర్, ముఖ్యమంత్రి పర్యటనకు సంబంధించిన విధుల కేటాయింపు ఉత్తర్వులు ఇప్పటికే జారీ చేసినట్లు తెలిపారు. భద్రతా ఏర్పాట్లను అత్యంత ప్రతిష్ఠాత్మకంగా చేపట్టాలని పోలీసు అధికారులను ఆదేశించారు.జాయింట్ కలెక్టర్ ఎస్. ప్రశాంత్ కుమార్ మాట్లాడుతూ, ముఖ్యమంత్రి పర్యటనకు సంబంధించిన ప్రతి ఏర్పాటును ముందస్తు కార్యాచరణ ప్రణాళిక ప్రకారం పూర్తి చేయాలని సూచించారు. హెలిప్యాడ్ వద్ద అనధికార వ్యక్తులను అనుమతించకుండా కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలని, సభా ప్రాంగణంలో ఎటువంటి అవాంఛనీయ ఘటనలకు తావు లేకుండా అధికారులు బాధ్యతాయుతంగా వ్యవహరించాలని ఆదేశించారు.సమావేశంలో జిల్లా రెవెన్యూ అధికారి పి. అంబేద్కర్, ఆర్జేడీ నాగమణి, డీఆర్‌డీఏ పీడీ డా. దాసరి రత్నాకర్ రావు, పీడీ (ఉపాధి) బి. రాంప్రసాద్, డీపీఓ చంద్రశేఖర్, డీఈవో శ్రీరామమూర్తి, డీఎంఅండ్‌హెచ్‌వో పి. సరిత, డీసీహెచ్ఎస్ సాంబశివరావు, ఆర్టీసీ డీఎం మార్గరెట్, ఆర్టీవో రాజేష్ కుమార్‌తో పాటు వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

## గొరగుమ్మి ఎంపీపీ పాఠశాలలో పెరటి కూరగాయల తోట

విద్యార్థుల్లో ప్రకృతి వ్యవసాయం, ఆరోగ్యకరమైన ఆహారంపై అవగాహనకు వినూత్న కార్యక్రమం





**గంగవరం, పెన్ పవర్ జూలై 16:** విద్యార్థుల్లో ప్రకృతి పట్ల మమకారం పెంపొందించడంతో పాటు ఆరోగ్యకరమైన ఆహారపు అలవాట్లు అలవరచే లక్ష్యంతో పోలవరం జిల్లా గంగవరం మండలం గొరగుమ్మి గ్రామంలోని ఎంపీపీ పాఠశాలలో పెరటి కూరగాయల తోటను ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమం విద్యార్థులు, ఉపాధ్యాయులు, గ్రామస్థుల సహకారంతో ఉత్సాహభరితంగా నిర్వహించారు.పాఠశాల ఆవరణలో పాలకూర, మెంతికూర, టమాటా, బెండకాయ, వంకాయ, మిరప తదితర కూరగాయల మొక్కలను నాటారు. అనంతరం విద్యార్థులు ఉపాధ్యాయుల పర్యవేక్షణలో మొక్కలకు నీరు పోయడం, కలుపు తొలగించడం, మొక్కల సంరక్షణ వంటి పనుల్లో చురుకుగా పాల్గొన్నారు.ఈ సందర్భంగా ప్రకృతి వ్యవసాయ డీఎంఎంటీ నూకేష్ మాట్లాడుతూ, విద్యార్థులు, గ్రామ ప్రజల్లో వ్యవసాయం పట్ల ఆసక్తిని పెంపొందించడంతో పాటు సేంద్రీయ సాగు విధానాలపై అవగాహన కల్పించడమే ఈ కార్యక్రమం ప్రధాన ఉద్దేశమని తెలిపారు. చిన్ననాటి నుంచే ప్రకృతి వ్యవసాయంపై అవగాహన కల్పిస్తే భవిష్యత్తులో ఆరోగ్యకరమైన సమాజ నిర్మాణానికి దోహదపడుతుందని పేర్కొన్నారు.పాఠశాల ప్రధానోపాధ్యాయులు కె. వెంకటేశ్వర్లు దొర మాట్లాడుతూ, పాఠశాలలో పండించే తాజా కూరగాయలను మధ్యాహ్న భోజన పథకంలో వినియోగించేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు. దీంతో విద్యార్థులకు పోషకాహారం అందించడంతో పాటు స్వయంగా పండించిన ఆహారంపై అవగాహన పెరుగుతుందని చెప్పారు.ఈ కార్యక్రమాన్ని గ్రామస్థులు, తల్లిదండ్రులు అభినందిస్తూ, ప్రతి ప్రభుత్వ పాఠశాలలో ఇలాంటి పెరటి కూరగాయల తోటలు ఏర్పాటు చేసి విద్యార్థుల్లో ప్రకృతి వ్యవసాయం, పోషకాహారంపై చైతన్యం కల్పించాలని ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో విద్యా కమిటీ చైర్మన్ కె. రాజారెడ్డి, సర్పంచ్ ఓ. ప్రతాప్ రెడ్డి, వార్డు సభ్యుడు ఎల్. అబ్బాయి రెడ్డి, ఎఫ్ఎంటీ వెంకటేష్, ఐసీఆర్‌పీ కరుణసుందరి, గ్రామస్థులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## వ్యవసాయ శాఖ మంత్రి కింజరపు అచ్చెన్నాయుడు ను ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ






**అంబాజీపేట, పెన్ పవర్, జూలై 16:**పి. గన్నవరం ధనవర్ష ఫంక్షన్ హాల్‌లో నిర్వహించిన తెలుగుదేశం పార్టీ విస్తృతస్థాయి సమావేశంలో పాల్గొనడానికి విచ్చేసిన డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ కోనసీమ జిల్లా ఇన్‌చార్జి మంత్రి, రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరపు అచ్చెన్నాయుడును పి. గన్నవరం నియోజకవర్గ శాసన సభ్యులు గిడ్డి సత్యనారాయణ ఎమ్మెల్యే క్యాంపుకార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు.

ఈ సందర్భంగా ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ మంత్రి వర్యులను శాలువాతో ఘనంగా సత్కరించి, ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన అయినవిల్లి సిద్ధి వినాయక స్వామి దేవస్థాన చిత్రపటాన్ని జ్ఞాపికగా అందజేశారు. అనంతరం నియోజకవర్గ అభివృద్ధి, ప్రజా సంక్షేమ కార్యక్రమాలు పార్టీ బలోపే తానికి సంబంధించిన పలు అంశాలపై చర్చించారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు కార్యకర్తలు ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు

## జిల్లా టిడిపి ఉపాధ్యక్షులుకందుల చిట్టిబాబు కుటుంబాన్ని పరామర్శించిన ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ

**గండేపల్లి, పెన్ పవర్, జులై 16** మాతృవియోగంతో బాధపడుతున్న కాకినాడ జిల్లా తెలుగుదేశం పార్టీ ఉపాధ్యక్షులు, జెడ్ రాగంపేట మాజీ సర్పంచ్ కందుల చిట్టిబాబు తల్లి కందుల సుభద్రమ్మ ఇటీవల మరణించారు. ఈ నేపథ్యంలో గురువారం టిడిపి పొలిట్ బ్యూరో సభ్యులు, తిరుమల తిరుపతి దేవస్థానం పాలకమండలి సభ్యులు, జగ్గంపేట శాసనసభ్యులు జ్యోతుల నెహ్రూ గండేపల్లి మండలం జెడ్.రాగంపేటలోని కందులచిట్టిబాబు స్వగృహానికి వెళ్లి సుభద్రమ్మ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. చిట్టిబాబు కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కమ్మ, ఆర్యవైశ్య కార్పొరేషన్ డైరెక్టర్లు పోతుల మోహనరావు, కొత్త కొండబాబు, జెడ్ రాగంపేట సొసైటీ చైర్మన్ కందుల కొండయ్య చౌదరి( బాబ్జి ), కందుల వినయ్, కంటే సురేంద్ర, కందుల గోవిందు చౌదరి,పాలచర్లసత్యనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

Printed by Published by GANTYADA APPARAO on behalf of GANTYADA APPARAO, printed at printed at SRI SAI GANGA PRINTERS AND PUBLISHERS FLAT NO: 504, Bharat Towers, 5th lane, Dwaraka Nagar, Visakhaptanam, Andhrapradesh-530016, and published at Flat No F2, Nihar towers, Srinagar, kakinada, kakinada District, Andhrapradesh -533003 Editor: GANTYADA APPARAO. Mobile : 9059465965, RNI : APTEL/2017/73154 , editorpenpower@gmail.com

# 26 లక్షల ఓట్లపై గల్లంతు

**విజయవాడ, జూలై 16, పెన్ పవర్:** ఆంధ్రప్రదేశ్ లో ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణ కార్యక్రమం వేగంగా కొనసాగుతోంది. గత నెల రోజులుగా రాష్ట్రవ్యాప్తంగా ఈ ప్రక్రియ నిర్వహించగా, ఇప్పటికే ఎక్కువ భాగం పూర్తయిందని ఎన్నికల అధికారులు వెల్లడించారు. అయితే ఇంకా కొంత పని మిగిలి ఉండటంతో గడువును పొడిగించాలని రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి వివేక్ యాదవ్ కేంద్ర ఎన్నికల సంఘం ను కోరారు. ఈ విజ్ఞప్తిని పరిశీలించిన కేంద్ర ఎన్నికల సంఘం మరో పది రోజుల అదనపు గడువును మంజూరు చేసింది. దీంతో మిగిలిన పనిని త్వరగా పూర్తి చేసేందుకు అధికారులు మరింత చురుకుగా పనిచేస్తున్నారు.రాష్ట్రంలోని వివిధ రాజకీయ పార్టీల నుంచి కూడా గడువు పొడిగించాలన్న అభ్యర్థనలు రావడంతో ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది. ఇప్పటివరకు సుమారు 88 శాతం సవరణ ప్రక్రియ పూర్తయిందని అధికారులు చెబుతున్నారు. ఇంకా దాదాపు 12 శాతం పని మిగిలి ఉండగా, కొత్త గడువులో దానిని కూడా పూర్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. ఈ కార్యక్రమంలో భాగంగా బూత్ లెవల్ అధికారులు ఇంటింటికీ వెళ్లి ఓటర్లను కలుస్తున్నారు. ఎన్యూమరేషన్ ఫారాలు అందజేయడంతో పాటు, వాటిని సేకరించి డిజిటల్ రూపంలో నమోదు చేసే ప్రక్రియను వేగవంతం చేస్తున్నారు. ఈ విధంగా ప్రతి ఓటరు వివరాలను సరిచూసి, ఖచ్చితమైన జాబితాను సిద్ధం చేయడంపై ఎన్నికల సంఘం దృష్టి సారించింది.రాష్ట్రంలో ప్రస్తుతం మొత్తం 4 కోట్ల 16 లక్షల 26 వేల 144 మంది ఓటర్లు ఉన్నట్లు అధికారిక లెక్కలు చెబుతున్నాయి. వీరందరికీ ఎన్యూమరేషన్ ఫారాలు పంపిణీ చేసినట్లు అధికారులు తెలిపారు. జూలై 14 నాటికి 3 కోట్ల 69 లక్షల 50 వేల 812 మంది ఓటర్ల వివరాలను డిజిటలైజేషన్ చేసినట్లు వెల్లడించారు. మరో 1.67 శాతం ఫారాల నమోదు మాత్రమే పెండింగ్‌లో ఉందని, అది కూడా త్వరలో పూర్తవుతుందని పేర్కొన్నారు. ఈ సవరణ ప్రక్రియలో కీలకమైన విషయం ఏమిటంటే, రాష్ట్రంలో ఇప్పటికే మరణించిన 14 లక్షల 19 వేల 644 మంది పేర్లు ఓటర్ల జాబితాలో ఉన్నట్లు అధికారులు గుర్తించారు. సంబంధిత ధృవీకరణ పూర్తయిన తర్వాత ఈ పేర్లు జాబితా నుంచి తొలగించబడతాయి. అదే విధంగా ఉద్యోగాలు, వ్యాపారం లేదా ఇతర కారణాలతో శాశ్వతంగా ఇతర రాష్ట్రాలు లేదా విదేశాలకు వెళ్లి అక్కడే స్థిరపడిన వారి వివరాలను కూడా పరిశీలించారు.ఇప్పటికే 12 లక్షల 14 వేల 994 మంది శాశ్వతంగా ఇతర ప్రాంతాలకు మారినట్లు గుర్తించిన అధికారులు, వారి ఓటు నమోదుపై కూడా తగిన చర్యలు చేపడుతున్నారు. మరణించిన వారు, శాశ్వతంగా వేరే ప్రాంతాలకు మారిన వారి సంఖ్య కలిపితే దాదాపు 26 లక్షల ఓట్లు జాబితా నుంచి తొలగించే అవకాశం ఉందని అంచనా వేస్తున్నారు.మరో పది రోజుల పాటు కొనసాగనున్న ఈ ప్రత్యేక సవరణ ప్రక్రియలో ఇంకా మరికొన్ని మార్పులు చోటు చేసుకునే అవకాశం ఉందని అధికారులు భావిస్తున్నారు. ఈ కార్యక్రమం పూర్తయిన తర్వాత రాష్ట్రంలో డబుల్ ఓటింగ్‌కు అవకాశం తగ్గడంతో పాటు, చెల్లని ఓట్లను తొలగించి మరింత పారదర్శకమైన ఓటర్ల జాబితాను సిద్ధం చేయగలమనే ఆశాభావాన్ని ఎన్నికల అధికారులు వ్యక్తం చేస్తున్నారు. దీంతో రానున్న ఎన్నికల నిర్వహణ మరింత విశ్వసనీయంగా ఉండే అవకాశాలు కనిపిస్తున్నాయి.

03
ఇప్పుడు పెన్ పవర్ దిన పత్రికలో
కోర్టు పబ్లికేషన్ యాడ్స్
కేవలం
యాడ్ 500/-
'పో. 12 సెం.మీ, వె. 8 సెం.మీ'
'మరిన్ని వివరాలకు సంప్రదించండి '
93948 55244
షరతులు వర్తిస్తాయి

## జగన్ ఫ్రస్టేషన్ అంతకు మించి




**విజయవాడ, జూలై 16, పెన్ పవర్:** వైసీపీ అధినేత వైఎస్ జగన్ మోహన్ రెడ్డి విశాఖపట్నం పర్యటనలో చేసిన వ్యాఖ్యలు, ఇచ్చిన హామీలు చూస్తూ జగన్మోహన్ రెడ్డి పూర్తిగా విచక్షణ కోల్పోతున్నట్లుగా ఎవరికైనా అర్థమైపోతుంది. సముద్రంలో జరిగిన బోటు ప్రమాద బాధితులను పరామర్శించే క్రమంలో ఆయన మాట్లాడిన తీరు, వ్యవస్థలపై చేసిన విమర్శలు ఆయన పారదర్శకతను, చట్టాలపై ఉన్న అవగాహనను ప్రశ్నించేలా ఉన్నాయి. ఒక మాజీ ముఖ్యమంత్రిగా పనిచేసిన వ్యక్తి, క్షేత్రస్థాయి న్యాయ సూత్రాలను పక్కనబెట్టి కొంత మందిని మోసం చేయడానికి అడ్డగోలుగా మాట్లాడేస్తున్నారు.సముద్రంలో వేటకు వెళ్లి బోటు మునిగిపోయిన ప్రమాదంలో వ్యవస్థలన్నీ శ్రమించి సహాయక చర్యలు చేపట్టిన విషయాన్ని జగన్ రెడ్డి పూర్తిగా పక్కనబెట్టేశారు. వాళ్లను కాపాడకపోవడం కోస్ట్ గార్డ్ చేసిన తప్పని తేల్చేశారు. కళ్ళు మూసి తెరిచే లోపు మూడేళ్లు అయిపోతాయని, వైసీపీ అధికారంలోకి వచ్చిన నెల రోజుల్లోనే మత్స్యకార బాధిత కుటుంబాలకు కోటి రూపాయల చొప్పున ఇస్తానని ఆయన హామీ ఇచ్చేశారు.ప్రస్తుతం ప్రతిపక్షంలో ఉండి, బాధితులకు తక్షణమే ఎలాంటి ఆర్థిక సహాయం చేయకుండా, భవిష్యత్తులో అధికారంలోకి వస్తే ప్రజాధనం నుంచి కోటి రూపాయలు ఇస్తానంటూ కాలయాపనతో కూడిన హామీలు ఇవ్వడం బాధితులను మభ్యపెట్టడమే. గతంలో ఆయన హయాంలో వందల మంది మత్స్యకారులు చనిపోతే.. బోట్లు తగలబడిపోతే పైసా ఇవ్వని వ్యక్తి ఆయన అని అందరికీ తెలుసు.మరీ ముఖ్యంగా, మాజీ మంత్రి సీదిరి అప్పలరాజు కుమారుడికి సంబంధించిన హిట్ అండ్ రన్ కేసులో జగన్ వ్యవహరించిన తీరు చట్టాలను తెలిసిన వారిని సైతం దిగ్భ్రాంతికి గురిచేస్తోంది. బైక్ యాక్సిడెంట్ చేసి ఓ నిరుపేద వ్యక్తి మరణానికి కారణమవ్వడమే కాకుండా, పోలీసులను తప్పుదోవ పట్టించేందుకు అసలు సంబంధం లేని మరో యువకుడిని నిందితుడిగా ఇరికించే ప్రయత్నం చేశాడు. ఆధారాలతో సహా దొరికిపోయిన తర్వాతే నిందితుడు లొంగిపోగా, అసలు ఆ 18 ఏళ్ల పిల్లోడిపై కేసు పెట్టడమే తప్పు అన్నట్లుగా జగన్ మాట్లాడటం వెనుక కేవలం రాజకీయ ఓటు బ్యాంకు ప్రయోజనాలే కనిపిస్తున్నాయనే విమర్శలు వస్తున్నాయి.ఈ కేసులో నిందితుడిని వెనకేసుకురావడం ద్వారా చట్టం ముందు అందరూ సమానులే అనే ప్రాథమిక సూత్రాన్ని జగన్ రెడ్డి విస్మరించినట్లు స్పష్టమవుతోంది. నిందితుడు తమ పార్టీ నేత కుమారుడైనంత మాత్రాన, ఈ ప్రమాదంలో చనిపోయిన ఒక బీసీ సామాజికవర్గానికి చెందిన గొర్రెల కాపరి ప్రాణానికి విలువే లేదా అనే ప్రశ్నలు తలెత్తుతున్నాయి. ఐదేళ్ల పాటు రాష్ట్రాన్ని పాలించిన వ్యక్తికి చట్టాలపై కనీస అవగాహన లేకపోవడం, లేదా తెలిసి కూడా తప్పుడు కేసులను సమర్థించడం చూస్తుంటే ఆయన పూర్తి మైండ్ బ్యాలెన్స్ కోల్పోయారనడానికి ఈ విశాఖ పర్యటనే నిదర్శనంగా కనిపిస్తోంది.

## కేరళ రేంజ్ లో ఏపీలో ఆ 23 గ్రామాలు..!

**విశాఖపట్టణం, జూలై 16, పెన్ పవర్:** ఆంధ్రప్రదేశ్ పంచాయతీరాజ్ శాఖ పాలనలో సరికొత్త మైలురాయిని అందుకుంది. రాష్ట్రంలోని 23 గ్రామ పంచాయతీలు తమ అద్భుతమైన సేవలు, పారదర్శక విధానాలకు గానూ ప్రతిష్టాత్మక అంతర్జాతీయ ఐఎస్ఓ గుర్తింపును సొంతం చేసుకున్నాయి. స్థానిక సంస్థల పరిధిలో ప్రజలకు నాణ్యమైన సేవలు అందించడమే లక్ష్యంగా ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలు ఈ విజయంతో సత్ఫలితాలను ఇచ్చాయని స్పష్టమవుతోంది.గ్రామ పంచాయతీల పరిధిలో ప్రభుత్వ రికార్డులను పక్కాగా నిర్వహించడం, ప్రజలకు కావాల్సిన వివిధ రకాల ధృవపత్రాలను (సర్టిఫికెట్లు) ఎలాంటి ఆలస్యం లేకుండా త్వరితగతిన జారీ చేయడంలో ఈ 23 పంచాయతీలు విశేష ప్రతిభ కనబరిచాయి. కార్యాలయాల నిర్వహణలో అంతర్జాతీయ ప్రమాణాలు పాటించడంతో పాటు, జవాబుదారీతనంతో కూడిన పాలనను అందించినందుకు గానూ ఈ ఐఎస్ఓ సర్టిఫికేషన్ లభించింది. ఈ అరుదైన గుర్తింపు సాధించిన గ్రామ పంచాయతీల సిబ్బందిని, అధికారులను ఏపీ పంచాయతీరాజ్ శాఖ కమిషనర్ కృష్ణతేజ ఐఏఎస్ ప్రత్యేకంగా అభినందించారు.గ్రామీణ ప్రాంతాల్లోని ప్రజలకు మెరుగైన సేవలందించడంలో సిబ్బంది చూపిన ప్రతిభను ఆయన కొనియాడారు. ఇదే ఉత్సాహంతో భవిష్యత్తులో రాష్ట్రంలోని మరిన్ని గ్రామ పంచాయతీలు ఈ స్థాయికి చేరుకోవాలని ఆయన ఆకాంక్షించారు. స్థానిక స్వపరిపాలనలో దేశంలోనే ముందంజలో ఉన్న కేరళ రాష్ట్ర తరహాలోనే, ఆంధ్రప్రదేశ్‌లోని గ్రామాలను కూడా ఆదర్శవంతంగా తీర్చిదిద్దాలని ఏపీ పంచాయతీరాజ్ శాఖ గట్టి పట్టుదలతో ఉంది. అందులో భాగంగానే డిజిటలైజేషన్, వేగవంతమైన పౌర సేవలను విస్తృతం చేస్తూ, రాబోయే రోజుల్లో రాష్ట్రంలోని మరిన్ని గ్రామ పంచాయతీలకు కూడా ఐఎస్ఓ ప్రమాణాలు దక్కేలా అధికారులు ప్రత్యేక ప్రణాళికలతో కసరత్తు చేస్తున్నారు.

## నల్లమల్లో వజ్రాల వేట

**కర్నూలు, జూలై 16, పెన్ పవర్:** నంద్యాల – ఒంగోలు జాతీయ రహదారి పరిధిలోని నల్లమల అటవీ ప్రాంతంలో ఉన్న ఎర్రవాగులో వజ్రాల వేట మొదలైంది. పెద్దగా వర్షాలు కురవకపోయినా.. గతంలో కురిసిన వర్షాలకు అటవీ ప్రాంతం నుంచి నీరు వచ్చింది. దాంతో అడవిలోని వజ్రాలు వాగుతో సహా కొట్టుకొచ్చి ఉంటాయనే కారణంతో స్థానికులు వజ్రాల అన్వేషణ మొదలుపెట్టారు. నీటి అడుగు భాగంలో వజ్రాల కోసం అన్వేషణ చేస్తున్నారు. కడప, కర్నూలు, మార్కాపురం జిల్లా ప్రజలు ఎక్కువగా అన్వేషిస్తున్నారు.నల్లమల అటవీ ప్రాంతం మరోసారి ఆశావాహులతో కిటికిటలాడుతోంది. వర్షాకాలం మొదలైందంటే నల్లమల ప్రాంతమంతా వజ్రాల వేటే. ప్రతి ఒక్కరూ తమ అదృష్టాన్ని పరీక్షించుకోవడానికి సిద్ధమవుతుంటారు. కొంతమంది అయితే నెలల తరబడి ఇదే ప్రాంతంలో ఉంటూ వజ్రాల వేట కొనసాగిస్తారు. ముఖ్యంగా నంద్యాల ఒంగోలు ప్రధాన మార్గంలోని నల్లమల అడవీలో ఉన్న ఎర్రవాగు వైపే అందరూ ప్రయాణిస్తారు.నల్లమల అడవీలో ఉన్న ఎర్రవాగులో జోరుగా వజ్రాల వేట కొనసాగుతోంది. నంద్యాల, కర్నూలు, మార్కాపురం, కడప, ప్రకాశం, గుంటూరు జిల్లాల పరిధిలోని గ్రామాలకు చెందిన మహిళలు, పురుషులు ఎర్రవాగుకు చేరుకుని వజ్రాల వేట కొనసాగిస్తున్నారు. వాగు వెంట నీటిలో జల్లెడ పడుతున్నారు. ప్రతి ఏటా వాగులో నీరు ప్రవహించే సమయాల్లో వజ్రాల కోసం ఈ అన్వేషణ కొనసాగుతుంది.నెల రోజుల వ్యవధిలో ఇటీవల కురిసిన సాధారణ వర్షాలకు నల్లమలలో నీటి ప్రవాహం జరిగింది. దాంతో ప్రజలు వజ్రాల వేట కొనసాగిస్తున్నారు. గత నెలలో కర్నూలు జిల్లా తుగ్గిలి మండలం జొన్నగిరిలో కూడా వజ్రాల వేట మొదలుపెట్టారు. జొన్నగిరి ప్రాంతంలో పొలాలకు వెళ్లి మరీ అన్వేషణ కొనసాగిస్తున్నారు. చిన్న వజ్రం దొరికినా తమ రాత మారుతుందనే ఆశతో ప్రజలు జల్లెడ పడుతున్నారు.ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో అనంతపురంలోని వజ్రకరూర్, కర్నూలు జిల్లాలోని తుగ్గిలి, జొన్నగిరి వీటితో పాటు నల్లమల అటవీ ప్రాంతంలో కృష్ణా నది తీర ప్రాంతాల్లో వజ్రాల వేట కొనసాగుతోంది. తొలకరి వర్షాలకు మట్టి కొట్టుకుపోయి వజ్రాలు బయటపడతాయని ప్రజలు భావిస్తుంటారు. ఈ ప్రాంతాల్లో దొరికే వజ్రాలకు ప్రపంచ వ్యాప్తంగా మంచి గుర్తింపు ఉంది.నంద్యాల జిల్లా మహానంది మండలం గాజులపల్లి సమీపంలో నల్లమల అటవీ ప్రాంతంలో ఉన్న ఎర్రవాగు, రాళ్లవాగులో వర్షాకాలం వజ్రాల అన్వేషణ జోరుగా సాగుతుంది. గాజులపల్లి సమీపంలోని శ్రీ లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో పూర్వం స్వామి, అమ్మవార్ల కల్యాణానికి వజ్రాలను తలంబ్రాలుగా ఉపయోగించే వారని, అందుకే ఈ ప్రాంతంలో వజ్రాలు దొరికే అవకాశం ఉందని ప్రజలు భావిస్తారు. కేవలం స్థానికులే కాకుండా దూర ప్రాంతాల నుంచి కూడా వచ్చి తమ అదృష్టాన్ని పరీక్షించుకుంటారు.

# ఎమ్మెల్యేల్లో అంతర్గత అసహనం

**విజయవాడ, జూలై 16, పెన్ పవర్:** ఆంధ్రప్రదేశ్‌లో అధికారంలోకి వచ్చిన తర్వాత తెలుగుదేశం పార్టీ కూటమి ప్రభుత్వం పటిష్టమైన పాలనపై దృష్టి పెట్టినప్పటికీ, తెరవెనుక పార్టీ ఎమ్మెల్యేలలో పెరుగుతున్న అసంతృప్తి ఇప్పుడు అధిష్ఠానానికి సరికొత్త సవాల్‌గా మారుతోంది. అయితే, ఈ అసంతృప్తికి ప్రభుత్వంపై వ్యతిరేకత కానీ, నిధుల కొరత కానీ కారణం కాకపోవడం ఇక్కడ అసలు ట్విస్ట్. క్షేత్రస్థాయిలో తమకు దశాబ్దాలుగా శత్రువులుగా ఉన్న వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ద్వితీయ శ్రేణి నాయకులను, ప్రత్యర్థులను ప్రభుత్వం ఆర్థికంగా దెబ్బతీయకపోగా, అయాచితంగా కొన్ని నిర్ణయాల వల్ల వారు మరింత బలోపేతం అవుతుండటమే ఈ అసంతృప్తికి ప్రధాన కారణం.ఈ అంతర్గత అసహనానికి తాజా ఉదాహరణగా గన్నవరం శాసనసభ్యుడు యార్లగడ్డ వెంకట్రావు నిలిచారు. గన్నవరం నియోజకవర్గంలో గత ప్రభుత్వ హయాంలో టీడీపీ కేడర్‌ను తీవ్ర ఇబ్బందులకు గురిచేసిన మాజీ ఎమ్మెల్యే వల్లభనేని వంశీ అనుచరులకు, ఆయనకు ఆర్థికంగా వెన్నుదన్నుగా నిలిచే ఒక ప్రముఖ కన్స్ట్రక్షన్ సంస్థకు గన్నవరం ఎయిర్‌పోర్ట్ టెర్మినల్ పెండింగ్ పనుల కాంట్రాక్ట్ దక్కడంపై వెంకట్రావు తీవ్ర అసంతృప్తికి లోనయ్యారు. తమ కళ్ల ముందే ప్రత్యర్థులు ప్రభుత్వ కాంట్రాక్టుల ద్వారా మళ్లీ ఆర్థికంగా పుంజుకుంటుంటే, నియోజకవర్గంలో తమ రాజకీయ ఉనికి ఏమవాలనే ఆందోళన ఆయనను బహిరంగంగానే మాట్లాడేలా చేసింది.వెంకట్రావు లేవనెత్తిన ఈ అంశం కేవలం గన్నవరానికి మాత్రమే పరిమితం కాలేదు, రాష్ట్రవ్యాప్తంగా మెజార్టీ టీడీపీ ఎమ్మెల్యేల అంతర్గత సమస్య ఇదేనని పొలిటికల్ సర్కిల్స్ లో విశ్లేషణలు సాగుతున్నాయి. గత ఐదేళ్లపాటు ప్రతిపక్షంలో ఉన్నప్పుడు తీవ్ర అణచివేతకు గురై, ఆస్తులు నష్టపోయి, పార్టీ కోసం నిలబడిన కార్యకర్తలపై నమోదైన పాత కేసులు ఇప్పటికీ పూర్తిగా పరిష్కారం కాలేదు. ఒకవైపు సొంత కేడర్ పోలీస్ స్టేషన్ల చుట్టూ తిరుగుతుంటే, మరోవైపు ప్రత్యర్థి పార్టీ నేతలు అధికార యంత్రాంగంలోని కొందరు అధికారుల అండతో యథేచ్ఛగా తమ వ్యాపారాలను, ఆర్థిక సామ్రాజ్యాలను కాపాడుకోవడం ఎమ్మెల్యేలకు మింగుడుపడటం లేదు.అధికారంలోకి వచ్చిన కొత్తలో సహజంగానే అధికారులు పాత కాంట్రాక్టర్ల పెండింగ్ పనులను క్లియర్ చేయడం, సాంకేతిక కారణాల వల్ల పాత సంస్థలకే ప్రాధాన్యత ఇవ్వడం జరుగుతుంటుంది. కానీ, రాజకీయ క్షేత్రంలో ఇది తప్పుడు సంకేతాలు పంపుతుందని విశ్లేషకులు భావిస్తున్నారు. ప్రత్యర్థులను ఆర్థికంగా దెబ్బతీయకపోతే, వారు రాబోయే రోజుల్లో మళ్లీ పుంజుకుని తమపైకే రాజకీయంగా దాడికి వస్తారనే భయం టీడీపీ ఎమ్మెల్యేలలో స్పష్టంగా కనిపిస్తోంది. అధికారుల నిర్ణయాలు తమ రాజకీయ భవిష్యత్తును దెబ్బతీస్తున్నాయని వారు అంతర్గత సమావేశాల్లో ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.ప్రస్తుతం ప్రభుత్వ నిర్వహణ, పాలనాపరమైన సంస్కరణలపైనే పూర్తి దృష్టి పెట్టిన టీడీపీ హైకమాండ్‌కు, సొంత పార్టీ శాసనసభ్యుల మనోభావాలను , క్షేత్రస్థాయిలో జరుగుతున్న లోపాలను గమనించడానికి తగినంత తీరిక లేనట్లు కనిపిస్తోంది. పార్టీ కోసం కష్టపడిన వారికి తగిన ప్రాధాన్యత దక్కడం లేదనే భావన కేడర్‌లో బలపడితే, అది రాబోయే రోజుల్లో ప్రభుత్వ ఇమేజ్‌పై ప్రభావం చూపే అవకాశం ఉంది. ఎమ్మెల్యేలు నేరుగా అసెంబ్లీ లోపల లేదా బహిరంగ వేదికలపై అసంతృప్తిని వెళ్లగక్కకముందే అధిష్ఠానం జోక్యం చేసుకోవాల్సి ఉంటుంది. టీడీపీ అగ్రనాయకత్వం ఈ తీవ్రతను గుర్తించి, నియోజకవర్గాల వారీగా ఎమ్మెల్యేల సమస్యలను ఆలకించకపోతే పరిస్థితి చేయిదాటిపోయే ప్రమాదం ఉంది. బ్యూరోక్రసీ తీసుకునే నిర్ణయాలు పార్టీ రాజకీయ ప్రయోజనాలకు గొడ్డలిపెట్టుగా మారకుండా ఒక స్పష్టమైన కోఆర్డినేషన్ కమిటీని ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉందని టీడీపీ సీనియర్ నేతలు అనుకుంటున్నారు.

**చంద్రబాబుకు తీరక లేదు... లోకేష్ బిజీ బిజీ**

ఆంధ్రప్రదేశ్‌లో కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత ఇది మంచి ప్రభుత్వం అనే నినాదంతో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పాలనను ముందుకు తీసుకెళ్తున్నారు. అయితే, ఈ మంచితనం ఇప్పుడు సొంత పార్టీ ఎమ్మెల్యేలకు, ముఖ్యంగా క్షేత్రస్థాయిలో కష్టపడిన కీలక నేతలకు ఒక కొత్త తలనొప్పిగా మారింది. తెలుగుదేశం పార్టీ లోని కొందరు సిట్టింగ్ ఎమ్మెల్యేలలో అంతర్గత అసంతృప్తి రోజురోజుకూ పెరిగిపోతోంది. గన్నవరం ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు వంటి నేతలు ఇటీవల బహిరంగంగానే తమ ఆవేదనను వెళ్లగక్కడం దీనికి నిదర్శనం. అయితే, ఈ అసంతృప్తి చంద్రబాబు నాయకత్వంపై కానీ, పార్టీ సిద్ధాంతాలపై కానీ కాదు. నియోజకవర్గాల స్థాయిలో తమ రాజకీయ, ఆర్థిక మనుగడకు పొంచి ఉన్న ప్రమాదంపైనే ఈ ఆందోళన అంతా.గత ఐదేళ్ల వైఎస్సార్‌సీపీ పాలనలో తీవ్రమైన అణచివేతను, ఆర్థిక నష్టాలను భరించి, నియోజకవర్గాల్లో పార్టీ జెండాను మోసి గెలిచిన టీడీపీ ఎమ్మెల్యేలకు ఇప్పుడు ఒక విచిత్రమైన పరిస్థితి ఎదురవుతోంది. ప్రభుత్వం అనుసరిస్తున్న ఉదార విధానాల వల్ల, నియోజకవర్గాల్లో పాత అధికార పార్టీకి చెందిన కాంట్రాక్టర్లు, మైనింగ్ మాఫియా, ఆర్థిక శక్తులు ఇప్పటికీ యథేచ్ఛగా తమ వ్యాపారాలను సాగిస్తూ ఆర్థికంగా మరింత బలం పుంజుకుంటున్నారు. రాజకీయం ముగిసింది.. ఇక అందరూ సమానమే అనే ప్రభుత్వ ధోరణి వీరికి వరంగా మారింది. ప్రత్యర్థులు ఇలాగే ఆర్థికంగా బలపడితే, రాబోయే రోజుల్లో వారు తమకే ఏకు మేకవుతారనే సహజమైన భయం టీడీపీ ఎమ్మెల్యేలను వెంటాడుతోంది. చెడ్డవాళ్లకు చూపించే అతి మంచితనం.. చివరికి తమ రాజకీయ జీవితాలకే చేటు చేస్తుందని వారు ఆందోళన చెందుతున్నారు.ప్రస్తుత పరిస్థితుల్లో ఎమ్మెల్యేలకు ఉన్న ఈ అంతర్గత, వ్యూహాత్మక సమస్యలను అధిష్ఠానానికి వివరించడం ఒక పెద్ద సవాలుగా మారింది. ముఖ్యమంత్రిగా చంద్రబాబు నాయుడు అమరావతి నిర్మాణం, సంక్షేమ పథకాల అమలు, రాష్ట్ర బడ్జెట్ నిర్వహణ వంటి భారీ బాధ్యతలతో క్షణం తీరిక లేకుండా గడుపుతున్నారు. మరోవైపు ఐటీ, నైపుణ్యాభివృద్ధి శాఖల మంత్రిగా నారా లోకేష్ కూడా నిరంతరం సమీక్షలు, పర్యటనలతో బిజీగా ఉన్నారు. కిందిస్థాయి ఎమ్మెల్యేల వ్యక్తిగత బాధలను, నియోజకవర్గాల గ్రౌండ్ రియాలిటీలను లోకేష్ ఒక్కరే పూర్తిగా వినడం లేదా పరిష్కరించడం ఆచరణాత్మకంగా సాధ్యం కావడం లేదు. దీనివల్ల క్యాడర్‌లో ఒక విధమైన ఒంటరితనం, ఆవేదన గూడుకట్టుకుంటున్నాయి.ఈ పొలిటికల్ గ్యాప్‌ను భర్తీ చేయడానికి టీడీపీ హైకమాండ్ తక్షణమే ఒక ప్రత్యేకమైన, అత్యంత నమ్మకమైన అంతర్గత వ్యవస్థను ఏర్పాటు చేయాల్సిన అవసరం ఎంతైనా ఉంది. పార్టీలోని సీనియర్ నేతలు లేదా పొలిట్‌బ్యూరో సభ్యులతో కూడిన ఒక ప్రత్యేక ఐదుగురు సభ్యుల కమిటీని ఏర్పాటు చేసి, ప్రతి వారం ఎమ్మెల్యేలతో వన్-టు-వన్ సమావేశాలు నిర్వహించాలి. తమ సమస్యలను క్లియర్ కట్‌గా చెప్పుకునే వేదిక ఉందని, తమ ఆందోళనలపై అధిష్ఠానం కచ్చితంగా యాక్షన్ తీసుకుంటుందనే గట్టి నమ్మకం ఎమ్మెల్యేలలో కలగాలి. అప్పుడే క్షేత్రస్థాయిలో అసంతృప్తి చల్లారి, ప్రభుత్వం-పార్టీల మధ్య సమన్వయం కుదురుతుంది.పాలనలో మంచితనం, పారదర్శకత ఎంత ముఖ్యమో.. క్షేత్రస్థాయిలో పార్టీని నమ్ముకున్న రాజకీయ సైనికులకు రక్షణ కల్పించడం కూడా అంతే ముఖ్యం. ప్రత్యర్థుల ఆర్థిక మూలాలను కట్టడి చేయకపోతే, రేపు స్థానిక సంస్థల ఎన్నికల్లో గానీ, భవిష్యత్తు రాజకీయాల్లో గానీ కూటమి తీవ్రమైన ప్రతిఘటనను ఎదుర్కోవాల్సి వస్తుంది. కాబట్టి, చంద్రబాబు-లోకేష్ ద్వయం ఇప్పటికైనా కిందిస్థాయి నేతల అంతర్గత ఆవేదనను గుర్తించి, వారి సమస్యల పరిష్కారానికి ఒక పటిష్టమైన వేదికను ఏర్పాటు చేయాలి. లేనిపక్షంలో, ఈ చిన్న చిన్న అసంతృప్తులే రాబోయే రోజుల్లో పెద్ద అంతర్గత కుమ్ములాటలకు దారితీసే ప్రమాదం ఉందనేది ఎక్కువ మంది అభిప్రాయం.

# అయోమయంలో అమరావతి రైతులు



**విజయవాడ, జూలై 16, పెన్ పవర్:** రాజధాని అమరావతిలో అత్యంత ప్రతిష్టాత్మకమైన ట్రంక్ ఇన్‌ఫ్రా ప్రాజెక్టులకు ఏళ్ల తరబడి ఉన్న ప్రధాన అడ్డంకులు ఎట్టకేలకు తొలగిపోయాయి. సీడ్ యాక్సెస్ రోడ్డు నిర్మాణానికి అత్యంత కీలకమైన ఉండవల్లి గ్రామంలోని సుమారు 2 ఎకరాల 77 సెంట్ల భూమిని ల్యాండ్ అక్విజిషన్ చట్టం ప్రకారం ప్రభుత్వం అధికారికంగా స్వాధీనం చేసుకుంది. రాజధాని అమరావతి అభివృద్ధిని అడ్డుకోవడమే లక్ష్యంగా కొందరు రైతులు, వారి వెనుక ఉన్న శక్తులు భీష్మించుకు కూర్చున్నప్పటికీ.. గుంటూరు జిల్లా కలెక్టర్ ఇచ్చిన నోటిఫికేషన్ గడువు ముగియడంతో రెవెన్యూ, సీఆర్‌డీఏ యంత్రాంగం రంగంలోకి దిగి భూమిని ఇంజనీరింగ్ అధికారులకు అప్పగించింది. దీంతో రాజధానిలో రవాణా వ్యవస్థకు గుండెకాయ లాంటి సీడ్ యాక్సెస్ రోడ్డు నిర్మాణానికి మార్గం సుగమమైంది.భూసేకరణ నిబంధనల ప్రకారం 10 మంది రైతులకు చెందిన ఈ 2.77 ఎకరాల భూమికి గాను ప్రభుత్వం మొత్తం రూ.7 కోట్ల 14 లక్షల భారీ పరిహారాన్ని ఖరారు చేసింది. ఈ లెక్కన ఎకరాకు సుమారు రూ.2 కోట్ల 58 లక్షల మేర నష్టపరిహారం లభిస్తుంది. శుక్రవారం రాత్రి సీఆర్‌డీఏ అధికారులు ఈ పరిహారానికి సంబంధించిన చెక్కులను నేరుగా రైతుల వద్దకు తీసుకువెళ్లినప్పటికీ, వారు వాటిని తీసుకోవడానికి నిరాకరించారు. అభివృద్ధికి సహకరించకుండా ఉద్దేశపూర్వకంగానే వారు చెక్కులను తిరస్కరించడంతో.. అధికారులు సదరు పరిహారం మొత్తాన్ని చట్టప్రకారం ఎల్.ఎల్.ఆర్.ఆర్ అథారిటీలో డిపాజిట్ చేశారు. అనంతరం రంగంలోకి దిగిన ఏడీసీఎల్ , ఎన్‌సీసీ కంపెనీల సిబ్బంది పనులను ముమ్మరం చేసి, 24 గంటల్లో గ్రావెల్ రోడ్డు నిర్మాణాన్ని పూర్తి చేసేందుకు యుద్ధప్రతిపాదికన మట్టి పనులు జరుపుతున్నారు.అమరావతి ల్యాండ్ పూలింగ్‌కు మొదటి నుండి సహకరించకుండా కోర్టు స్టేలతో కాలయాపన చేసిన ఈ భూముల వెనుక పెద్ద ఎత్తున వైసీపీ నేతల రాజకీయ హస్తం ఉందనే బలమైన అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. మిగిలిన రైతుల మాదిరిగానే వీరు కూడా ల్యాండ్ పూలింగ్‌కు భూములు ఇచ్చి ఉంటే, వాటికి బదులుగా వచ్చే కమర్షియల్, రెసిడెన్షియల్ ప్లాట్లను అమ్ముకున్నా ఎకరాకు సుమారు రూ.6 నుంచి 7 కోట్లకు పైగా వచ్చేది. కానీ, పూలింగ్ ఇవ్వకుండా కేవలం రూ.2.58 కోట్ల ప్రభుత్వ పరిహారానికి పరిమితం కావడం వెనుక వైసీపీ నేతల ఇన్‌సైడర్ ఒప్పందాలు ఉన్నట్లు తెలుస్తోంది. రాజధాని అభివృద్ధి ప్రాజెక్టులను అడ్డుకుంటే ఇచ్చే ప్యాకేజీలు, రాజకీయ లబ్ధి ఎక్కువగా ఉంటుందనే ఆశతోనే సదరు నేతలు ఈ భూములను ముందే కొనుగోలు చేసి, రైతుల పేరుతో తెరవెనుక డ్రామాలు ఆడించారనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి.అమరావతి సీడ్ యాక్సెస్ రోడ్డుకు ఆటంకంగా మారిన ఈ ల్యాండ్ పూలింగ్ వివాదంలో నోటీసులు ఇచ్చే వరకు మొత్తం 18 మంది రైతులు సుమారు 4 ఎకరాల మేర ఇవ్వకుండా మొండికేసారు. అయితే మారుతున్న పరిస్థితులు, లీగల్ చిక్కులను గమనించిన 8 మంది రైతులు ఇటీవలే తమ రెండు ఎకరాల భూమిని ప్రభుత్వానికి అప్పగించారు. మిగిలిన 2.77 ఎకరాలకు సంబంధించి ఒక స్థానిక న్యాయవాది స్వయంగా భూమి ఇవ్వనని పట్టుబట్టడంతో, ఆయన మాటలు నమ్మి మిగతా 9 మంది రైతులు కూడా ఇన్నాళ్లూ భూములను ఆపారు. దీంతో శనివారం ఉదయం అధికారులు మొదట సదరు లాయర్‌కు చెందిన పొలాన్ని స్వాధీనం చేసుకోవడంతోనే ఈ ఆపరేషన్ ప్రారంభించారు.

